RNI No: TELTEL/2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | బుధవారం | పేజీలు 8 | లింగబత్తిని కృష్ణ సీఎండీ & ఎడిటర్ 9701923260
సంపుటి: 4 సంచిక:103 | ఏప్రిల్ 08, 2026 | వెల: రూ.3-00



## హైదరాబాద్‌లో భారీగా డ్రగ్స్ పట్టివేత

2లో



## నెల గడవక ముందే వసూళ్లు!

- ఇప్పుడే ఇలా ఉంటే.. రాబోయే రోజులలో మరెలా ఉంటుందో..?
- చర్చనీయంగా మారిన పోలీసు తీరు
- కూపీ లాగుతున్న ఇంటెలిజెన్స్ వర్గాలు

2లో



2లో

## కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల మోసం

కేరళ ప్రజలకు కల్వకుంట్ల కవిత బహిరంగ విజ్ఞప్తి



## పార్టీ వీడుతున్న సీనియర్ నేతలు

# హస్తంలో అసంతృప్తి!

**వేద న్యూస్, పొలిటికల్ బ్యూరో**

తెలంగాణలో అధికారం చేపట్టిన జోష్‌లో ఉన్న కాంగ్రెస్ పార్టీకి.. ఇప్పుడు సొంత నేతల నుంచే సెగ తగులుతోంది. బయటకి అంతా బాగున్నట్లు కనిపిస్తున్నా, లోపల మాత్రం అసంతృప్తి జ్వాలలు ఉవ్వెత్తున ఎగసిపడుతున్నాయి. దశాబ్దాలుగా పార్టీని నమ్ముకున్న విధేయులు, సీనియర్ నాయకులు ఒక్కొక్కరుగా గళం విప్పుతుండటం.. మరికొందరు ఏకంగా పార్టీకే గుడ్ బై చెబుతుండటం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో పెను సంచలనంగా మారింది. అధికారంలోకి వచ్చిన కొద్ది నెలల్లోనే సీనియర్లు ఎందుకు అసహనం వ్యక్తం చేస్తున్నారు? బలమైన స్తంభాలుగా ఉన్న నేతలు ఎందుకు బీటలు వారుతున్నారు? అసలు గాంధీ భవన్‌లో ఏం జరుగుతోంది?

2లో

## తెలంగాణ కాంగ్రెస్‌లో ముదురుతున్న అసమ్మతి

- గాంధీ భవన్ వేదికగా ఆగ్రహ జ్వాలలు
- పాత తరం వర్సెస్ కొత్త తరం అన్నట్లుగా పరిస్థితి
- జీవన్ రెడ్డి నిష్క్రమణతో మొదలైన ముసలం
- అదే బాటలో ఆలోచన చేస్తున్న ధర్మపురి సంజయ్?
- మంత్రి పదవిపై కోమటిరెడ్డి బహిరంగ విమర్శలు
- పీఠం దక్కుంటే అడుగు ఎటువైపు?
- వలస నేతలకే ప్రాధాన్యమా? అంటూ సుదీర్ఘ అనుబంధం ఉన్న నేతల ఆవేదన
- రేవంత్ రెడ్డి టీమ్ సెగను చల్లార్చేనా?

# గణపురం చెరువుకు 'మట్టి' గ్రహణం



**అర్ధరాత్రి వేళ యథేచ్ఛగా మాఫియా దందా**

- తహసీల్దార్ కార్యాలయం ముందే నుంచే దారి..
- అధికారుల కళ్లు మూసి అక్రమ రవాణా
- జేసీబీల గర్జనలు.. ట్రాక్టర్ల హోరు
- నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న యంత్రాంగం
- కాసుల కక్కుర్తిలో సంబంధిత శాఖల అధికారులు
- పర్యావరణానికి పొంచి ఉన్న ముప్పు

2లో

**వేద న్యూస్, ఫోకస్ టీమ్**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండల కేంద్రంలోని ప్రధాన చెరువు ప్రస్తుతం మట్టి మాఫియాకు కాసుల కురిపించే కామధేనువుగా మారింది. పగలు ప్రశాంతంగా కనిపించే ఈ జలాశయం, చీకటి పడగానే అక్రమార్కుల అడ్డాగా మారుతూ రూపురేఖలు కోల్పోతోంది. ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి, తహసీల్దార్ కార్యాలయం ముందే యథేచ్ఛగా ట్రాక్టర్లతో మట్టిని తరలిస్తున్నా.. అడ్డుకోవాల్సిన అధికారులు కన్నెత్తి చూడక పోవడం వెనుక భారీగా ముడుపులు అందుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. అడ్డగోలు తవ్వకాలతో భూగర్భ జలాలు ప్రమాదంలో పడటమే కాకుండా, రాత్రివేళల్లో అతి వేగంతో వెళ్తున్న ట్రాక్టర్లతో స్థానికులు ప్రాణభయంతో వణికిపోతున్నారు.



## జగిత్యాల మున్సిపల్ కార్యాలయంపై ఏసీబీ దాడులు

- టౌన్ ప్లానింగ్ సహా పలు విభాగాల్లో తనిఖీలు
- రెవెన్యూ, శానిటేషన్ విభాగాల్లో కూడా లావాదేవీలపై విచారణ
- కీలక ఫైళ్లను సీజ్ చేసినట్లు సమాచారం

**వేద న్యూస్, జగిత్యాల**

అవినీతి ఆరోపణల నేపథ్యంలో జగిత్యాల మున్సిపల్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు మెరుపుదాడులు నిర్వహించారు. పలు విభాగాల్లో ఏకకాలంలో తనిఖీలు చేపట్టి కీలక రికార్డులను పరిశీలిస్తున్నారు. టౌన్ ప్లానింగ్ విభాగంపై ప్రత్యేక దృష్టి సారించిన అధికారులు, ప్లాన్ అనుమతులు మరియు నిబంధనల ఉల్లంఘనలపై వచ్చిన ఆరోపణలపై సంబంధిత ఫైళ్లను పరిశీలిస్తున్నారు. రెవెన్యూ, శానిటేషన్ విభాగాల్లో కూడా లావాదేవీలపై విచారణ కొనసాగుతోంది. తనిఖీల సమయంలో కార్యాలయ గేట్లు మూసివేసి సిబ్బంది మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని కాల్ వివరాలు, డిజిటల్ లావాదేవీలను పరిశీలిస్తున్నారు. కీలక ఫైళ్లను సీజ్ చేసి ఆధారాలను సేకరిస్తున్నారు. ఏసీబీ దాడులతో కార్యాలయంలో కలకలం నెలకొనగా, దర్యాప్తు కొనసాగుతోంది.

## నెల గడవక ముందే వసూళ్లు!

- ఇప్పుడే ఇలా ఉంటే.. రాబోయే రోజులలో మరెలా ఉంటుందో..?
- చర్చాంశనీయంగా మారిన పోలీసు తీరు
- కూపీ లాగుతున్న ఇంటెలిజెన్స్ వర్గాలు

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల**



జిల్లాలోని ఓ కీలక పోలీస్ స్టేషన్‌లో తాజాగా బాధ్యతలు చేపట్టిన పోలీసు అధికారి వచ్చి రాగానే వసూళ్లకు తెర లేపినట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తన పరిధిలో ఉన్న ఇటుక బట్టీ యజమానుల నుండి ఒక్కో బట్టీకి రూ.7వేల చొప్పున వసూళ్లు చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బాధ్యతలు స్వీకరించి నెల గడవక ముందే ఇలాంటి ఆరోపణలు రావడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. అనుమతులు, తనిఖీలు, కేసుల పేరుతో యజమానుల నుండి డబ్బులు వసూలు చేసినట్టు సమాచారం. ఇప్పటికే వ్యాపార పరంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఇటుక బట్టీల యజమానులకు ఇది మరింత భారంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు తెలిసింది. ఇప్పుడే పరిస్థితి ఇలా ఉంటే రాబోయే రోజుల్లో ఇంకెలా ఉంటుంది? అంటూ బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.కొత్తగా వచ్చిన అధికారిపై మొదటి నుంచే ఇలాంటి ఆరోపణలు రావడం చర్చనీయాంశంగా మారింది.ఇక ఈ వ్యవహారం పై ఇంటలిజెన్స్ వర్గాలు కూడా దృష్టి సారించినట్టు తెలుస్తోంది. ఈ వ్యవహారంపై లోతుగా కూపీ లాగుతూన్నట్లు సమాచారం.ప్రజలను రక్షించాల్సిన పోలీసులపై ఇలాంటి ఆరోపణలు రావడం పట్ల స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి పూర్తి స్థాయి విచారణ జరిపి నిజానిజాలు బయటపెట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

## కాంగ్రెస్ 'ఆరు గ్యారెంటీల' మోసం

- తెలంగాణను ఏటీఎంగా మార్చుకున్న అధిష్టానం
- కేరళ ప్రజలకు కల్వకుంట్ల కవిత బహిరంగ విజ్ఞప్తి
- నిధుల మళ్లింపుపై ఆరోపణలు

**వేద న్యూస్, హైదరాబాద్**



తెలంగాణలో ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజలను దారుణంగా మోసం చేసిందని, కేరళ ఓటర్లు ఆ పార్టీని నమ్మి మోసపోవద్దని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విజ్ఞప్తి చేశారు. కేరళ అసెంబ్లీ ఎన్నికల ప్రచారం ముగిసిన నేపథ్యంలో ఆమె ఒక ప్రత్యేక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. జై తెలంగాణ, జై కేరళ అంటూ ప్రసంగాన్ని ప్రారంభించిన కవిత, ఒక తెలంగాణ బిడ్డగా, అక్కడి ఆడపడుచుగా కేరళ ప్రజలకు వాస్తవాలను వివరించాల్సిన బాధ్యత తనపై ఉందని పేర్కొన్నారు. కేరళలో పినరయి విజయన్ నేతృత్వంలోని ఎల్డీఎఫ్ కూటమిని గెలిపించడం ద్వారానే అభివృద్ధి సాధ్యమవుతుందని ఆమె పిలుపునిచ్చారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేరళలో పర్యటించి అబద్ధపు ప్రచారం చేస్తున్నారని కవిత మండిపడ్డారు. తెలంగాణలో అన్ని హామీలు అమలు చేశామని రేవంత్ రెడ్డి చెప్పడం పచ్చి అబద్ధమని ధ్వజమెత్తారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలను ప్రకటించిందని, కానీ అధికారంలోకి వచ్చాక కేవలం ఉచిత బస్సు హామీని మాత్రమే నామమాత్రంగా అమలు చేస్తోందని విమర్శించారు. మిగిలిన ఐదున్నర గ్యారెంటీలు అటకెక్కాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేరళ ప్రజలకు అబద్ధపు వాగ్దానాలు చేస్తూ ఓట్లు అడుగుతున్న కాంగ్రెస్ నేతల అసలు రంగును గుర్తించాలని ఆమె కోరారు. త్వరలోనే తాను సొంతంగా ఒక రాజకీయ పార్టీని కూడా ఏర్పాటు చేయబోతున్నట్లు ఈ సందర్భంగా కవిత వెల్లడించడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. గ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ప్రధాన హామీలైన మహిళలకు నెలకు రూ. 2,500 సాయం, యువతకు నిరుద్యోగ భృతి మరియు ఉద్యోగాల భర్తీ, రైతులకు బోనస్, పెన్షన్ల పెంపు వంటివి ఏవీ అమలుకు నోచుకోలేదని కవిత ఆరోపించారు. కేవలం ఎన్నికల్లో గెలవడమే లక్ష్యంగా కాంగ్రెస్ ఇలాంటి మోసపూరిత హామీలు ఇస్తుందని దుయ్యబట్టారు. తెలంగాణ ప్రజలు ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో ఇబ్బందులు పడుతున్నారని, అదే పరిస్థితి కేరళకు రాకూడదని ఆమె హెచ్చరించారు. అవినీతిలో కూరుకుపోయిన కాంగ్రెస్ పార్టీకి అధికారం ఇస్తే రాష్ట్రం అధోగతి పాలవుతుందని విమర్శించారు. తెలంగాణలో రైతులు, సామాన్యులు తమ హక్కుల కోసం మళ్ళీ రోడ్లపైకి రావాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు.ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రం కాంగ్రెస్ పార్టీకి ఒక 'ఏటీఎం'లా మారిందని కవిత అత్యంత ఘాటుగా ఆరోపించారు. తెలంగాణలో అవినీతి ద్వారా కూడబెట్టిన నిధులను కాంగ్రెస్ పార్టీ కేరళ ఎన్నికల్లో విచ్చలవిడిగా ఖర్చు చేస్తోందని ధ్వజమెత్తారు. తెలంగాణ ప్రజల సొమ్మును ఇతర రాష్ట్రాల్లో రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడం దుర్మార్గమని మండిపడ్డారు. ఇలాంటి అవినీతి పార్టీని కేరళ గడ్డపై అడుగుపెట్టనివ్వకూడదని ఓటర్లను కోరారు. పినరయి విజయన్ నేతృత్వంలో కేరళ సాధించిన అభివృద్ధిని కొనసాగించాలంటే ఎల్డీఎఫ్‌కే ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. పారదర్శకమైన పాలన అందించే ఎల్డీఎఫ్ కూటమి వైపే కేరళ ప్రజలు మొగ్గు చూపుతారని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. కవిత విడుదల చేసిన ఈ వీడియో కేరళ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

## హుజూరాబాద్‌లో డంపింగ్ యార్డ్ సెగ

### 24 గంటల నిరాహార దీక్షకు దిగిన ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

**వేద న్యూస్, హుజూరాబాద్**

కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ పట్టణ శివార్లలో ప్రభుత్వం ప్రతిపాదించిన డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు వ్యతిరేకంగా సాగుతున్న ప్రజా ఉద్యమం మంగళవారం మరింత ఉధృతమైంది. ఈ ప్రాజెక్టు వల్ల స్థానిక ప్రజల ఆరోగ్యం దెబ్బతినడమే కాకుండా పర్యావరణానికి తీవ్ర ముప్పు వాటిల్లుతుందంటూ హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి 24 గంటల నిరాహార దీక్షకు దిగారు. ఉదయం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం, తెలంగాణ అమరవీరులను స్మరించుకుంటూ ఆయన దీక్షా స్థలికి చేరుకున్నారు. డంపింగ్ యార్డ్ నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకునే వరకు తమ పోరాటం ఆగదని, అవసరమైతే ఉద్యమాన్ని రాష్ట్ర స్థాయికి తీసుకెళ్తామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి చేపట్టిన ఈ నిరాహార దీక్షకు నియోజకవర్గవ్యాప్తంగా అనూహ్య స్పందన లభించింది. వివిధ గ్రామాల నుంచి వేలాది మంది ప్రజలు, ముఖ్యంగా మహిళలు స్వచ్ఛందంగా తరలివచ్చి దీక్షలో పాల్గొన్నారు. డంపింగ్ యార్డ్ వల్ల భూగర్భ జలాలు కలుషితం కావడమే కాకుండా, భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన గాలి అందకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

# హస్తంలో అసంతృప్తి!

## పార్టీ వీడుతున్న సీనియర్ నేతలు

- గాంధీ భవన్ వేదికగా ఆగ్రహ జ్వాలలు
- తరం వర్సెస్ కొత్త తరం అన్నట్లుగా పరిస్థితి
- జీవన్ రెడ్డి నిష్క్రమణతో మొదలైన ముసలం
- అదే బాటలో ఆలోచన చేస్తున్న ధర్మపురి సంజయ్?
- మంత్రి పదవిపై కోమటిరెడ్డి బహిరంగ విమర్శలు
- పీఠం దక్కుంటే అడుగు ఎటువైపు?
- వలస నేతలకే ప్రాధాన్యమా? అంటూ సుదీర్ఘ అనుబంధం ఉన్న నేతల ఆవేదన
- రేవంత్ రెడ్డి టీమ్ సెగను చల్లార్చేనా?



**వేద న్యూస్, పొలిటికల్ బ్యూరో**

తెలంగాణ కాంగ్రెస్‌లో అసంతృప్తి జ్వాలలు ఎగసిపడుతున్నాయి. దశాబ్దాలుగా పార్టీని నమ్ముకున్న సీనియర్లు ఒక్కొక్కరుగా పక్కకు తప్పుకుంటుండటం, మరి కొందరు బహిరంగంగానే తమ అసహనాన్ని వ్యక్తం చేస్తుండటం ఇప్పుడు గాంధీ భవన్ వర్గాల్లో కలకలం రేపుతోంది. ఒకప్పుడు పార్టీకి అండగా నిలిచిన బలమైన స్తంభాలు ఇప్పుడు బీటలు వారుతున్నాయనే సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

**40ఏళ్ల అనుబంధం తెంచుకున్న జీవన్ రెడ్డి**

ముఖ్యంగా, నలభై ఏళ్ల సుదీర్ఘ రాజకీయ ప్రస్థానం ఉన్న జీవన్ రెడ్డి వంటి సీనియర్ నేత పార్టీతో అనుబంధాన్ని తెంచుకోవడం అధిష్టానానికి పెద్ద దెబ్బనే చెప్పాలి. క్షేత్రస్థాయిలో పార్టీ కోసం పనిచేసిన నాయకులకు సరైన గుర్తింపు దక్కడం లేదన్న వాదనకు ఈ పరిణామం బలాన్ని చేకూర్చింది. జీవన్ రెడ్డి నిష్క్రమణ కేవలం ఒక వ్యక్తి వెళ్లడం మాత్రమే కాదు, పార్టీ పట్ల విధేయతతో ఉండే పాత తరం నాయకత్వం ఆలోచన ధోరణికి అద్దం పడుతోంది. సీనియర్లను గౌరవించుకోవడంలో విఫలమవుతున్నామన్న భావన కేడర్‌లో గందరగోళానికి దారితీస్తోంది.

**అసంతృప్తిగా ధర్మపురి సంజయ్**

ఇక ఇదే క్రమంలో దివంగత పీసీసీ అధ్యక్షుడు డి.శ్రీనివాస్ కుమారుడు ధర్మపురి సంజయ్ కూడా పార్టీ వీడనున్నట్లు జరుగుతున్న ప్రచారం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారింది. దశాబ్దాల కాలంగా తమ కుటుంబానికి కాంగ్రెస్‌తో ఉన్న అనుబంధాన్ని పక్కన పెట్టి, ఆయన అసంతృప్తి గళం విప్పడం వెనుక బలమైన కారణాలే ఉన్నట్లు కనిపిస్తున్నాయి. సరైన ప్రాధాన్యత దక్కకపోవడం, పార్టీ నిర్ణయాల్లో తమను భాగస్వాములను చేయకపోవడం వంటి అంశాలే సంజయ్‌ను ఈ దిశగా ఆలోచింపజేస్తున్నట్లు సమాచారం. ఆయన కూడా పార్టీకి గుడ్ బై చెబితే నిజామాబాద్ జిల్లాలో కాంగ్రెస్ తన పట్టును కొంత కోల్పోయే ప్రమాదం ఉంది.

**మంత్రి పదవి కోసం రాజగోపాల్ రెడ్డి**

మరోవైపు, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వ్యవహారం పార్టీలో మరింత సెగ పుట్టిస్తోంది. గత ఎన్నికల్లో తన గెలుపు ద్వారా పార్టీకి బలం చేకూర్చిన రాజగోపాల్ రెడ్డి, తనకు మంత్రి పదవి దక్కుతుందని ఆశించారు. అయితే సమీకరణాల వల్ల అది సాధ్యం కాకపోవడంతో ఆయన తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. రాబోయే మంత్రివర్గ విస్తరణలోనైనా తనకు చోటు దక్కుతుందా లేదా అనే ఉత్కంఠ ఆయనలో కొనసాగుతోంది. ఒకవేళ ఈసారి కూడా ఆయనకు నిరాశే ఎదురైతే, రాజగోపాల్ రెడ్డి తన తదుపరి అడుగు ఎటు వేస్తారనే దానిపై రకరకాల ఊహాగానాలు వినిపిస్తున్నాయి.


**ఇలాగే దూరమైతే..**

మొత్తానికి తెలంగాణ కాంగ్రెస్‌లో కొత్త, పాత నేతల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. అధికారంలో ఉన్న సమయంలో నాయకులను బుజ్జగించి, పార్టీని ఏకతాటిపైకి తీసుకురావడంలో అధిష్టానం వైఫల్యం చెందితే, అది రాబోయే రోజుల్లో పార్టీ మనుగడపై ప్రభావం చూపే అవకాశం ఉంది. అసంతృప్తితో ఉన్న ఈ కీలక నేతలు ఒకవేళ పార్టీకి దూరమైతే, క్షేత్రస్థాయిలో పార్టీ పట్టు సడలే ప్రమాదం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మరి ఈ అసమ్మతి జ్వాలలను ముఖ్యమంత్రి, పీసీసీ ఏ విధంగా చల్లారుస్తారో వేచి చూడాలి.

**బయట పడని ఎందరో..**

వీరితో పాటు పార్టీలో మరికొంత మంది సీనియర్ నేతలు సైతం తమకు సరైన ప్రాధాన్యత దక్కడం లేదని అంతర్గత చర్చల్లో అసహనం వ్యక్తం చేస్తున్నారు. దశాబ్దాలుగా పార్టీ జెండా మోసి, కష్టకాలంలో అండగా నిలిచిన తమను పక్కన పెట్టి, ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి లేదా జూనియర్లకు ప్రాముఖ్యతనిస్తున్నారనేది వీరి ప్రధాన ఆరోపణ. ముఖ్యంగా నామినేటెడ్ పదవుల భర్తీలోనూ, ప్రభుత్వ నిర్ణయాల్లోనూ తమ సలహాలకు విలువ ఇవ్వడం లేదని, కనీసం అపాయింట్‌మెంట్లు కూడా దొరకని పరిస్థితి ఉందని వారు ఆవేదన చెందుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇలాంటి నిశ్శబ్ద అసంతృప్తి ఏ క్షణమైనా బహిర్గతమై, పార్టీలో మరిన్ని గ్రూపు రాజకీయాలకు దారితీసే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

# గణపురం చెరువుకు 'మట్టి' గ్రహణం



**వేద న్యూస్, ఫోకస్ టీమ్**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండల కేంద్రంలోని ప్రధాన చెరువు ఇప్పుడు మట్టి మాఫియాకు కాసుల కురిపించే కామధేనువుగా మారింది. పగలు నిమ్మకు నీరెత్తినట్లు ప్రశాంతంగా కనిపించే ఈ జలాశయం, చీకటి పడగానే అక్రమార్కుల అడ్డాగా మారుతోంది. ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి, చెరువు రూపురేఖలను అడ్డగోలుగా మార్చేస్తున్నా, అడ్డుకోవాల్సిన అధికారులు మాత్రం చోద్యం చూస్తుండటం గమనార్హం. తహసీల్దార్ కార్యాలయం ముందు నుంచే యథేచ్ఛగా ట్రాక్టర్లు సాగుతున్నా.. సంబంధిత శాఖల పట్టింపులేమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

**నిబంధనలు గాల్లోకి.. మాఫియా జోరు**

ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండానే ఇక్కడ మట్టి అక్రమ రవాణా మూడు పువ్వులు.. ఆరు కాయలుగా సాగుతోంది. సూర్యుడు అస్తమించడమే ఆలస్యం.. జేసీబీలు చెరువులోకి దిగుతున్నాయి. పదుల సంఖ్యలో ట్రాక్టర్లు బారులు తీరుతున్నాయి. సామాన్యుడు తన ఇంటి అవసరానికి ఒక లోడు మట్టి తోలుకుందామంటే నిబంధనల పేరుతో కొరడా ఝుళిపించే అధికారులు, రాత్రి వేళ 30కి పైగా ట్రాక్టర్లు యథేచ్ఛగా తిరుగుతున్నా కన్నెత్తి చూడకపోవడం వెనుక భారీగా ముడుపులు అందుతున్నాయనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

**ప్రమాదంలో భూగర్భ జలాలు.. వణికిపోతున్న జనం**

అడ్డగోలుగా సాగుతున్న ఈ తవ్వకాల వల్ల చెరువు గర్భం దెబ్బతింటోంది. లోతైన గుంతల వల్ల భవిష్యత్తులో భూగర్భ జల మట్టం పడిపోయే ప్రమాదం ఉందని పర్యావరణ వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు, రాత్రి వేళల్లో అతివేగంతో గ్రామాల గుండా వెళ్లే ట్రాక్టర్ల ధాటికి స్థానికులు ప్రాణభయంతో వణికిపోతున్నారు. ఫిర్యాదులు చేసినా అధికారులు తమకేం పట్టన వ్యవహరించడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది.

**అర్ధరాత్రి వేళ యథేచ్ఛగా మాఫియా దందా..**


- తహసీల్దార్ కార్యాలయం ముందు నుంచే దారి
- అధికారుల కళ్లు మూసి అక్రమ రవాణా
- జేసీబీల గర్జనలు.. ట్రాక్టర్ల హోరు
- నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న యంత్రాంగం
- కాసుల కక్కుర్తిలో సంబంధిత శాఖలు
- పర్యావరణానికి పొంచి ఉన్న ముప్పు

**అధికారుల అండదండలతోనే..?**

సంబంధిత శాఖల అధికారుల కనుసన్నల్లోనే ఈ మట్టి దందా సాగుతోందని గ్రామస్థులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. తనిఖీలకు వస్తున్నామన్న సమాచారం ముందుగానే మాఫియాకు చేరుతుండటంతో, అధికారులు వచ్చే సమయానికి అక్కడ ఆవానవాలు కూడా ఉండటం లేదు. ముందుగా సమాచారం.. వెనుక తనిఖీ అన్న చందంగా సాగుతున్న ఈ తంతుపై ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సి ఉంది. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం స్పందించి, గణపురంలో సాగుతున్న ఈ మట్టి దోపిడీకి అడ్డుకట్ట వేయాలని, అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## హైదరాబాద్‌లో భారీగా డ్రగ్స్ పట్టివేత

### రూ. 64.35 లక్షల విలువైన మత్తుపదార్థాలు స్వాధీనం



**వేద న్యూస్, హైదరాబాద్**

హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో మాదకద్రవ్యాల విక్రయాలకు వ్యతిరేకంగా పోలీసులు చేపట్టిన ప్రత్యేక గాలింపు చర్యల్లో భారీ విజయం లభించింది. నగరంలోని చిలకలగూడ, ఆదిభట్ల మరియు సనత్ నగర్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన జాయింట్ ఆపరేషన్‌లో సుమారు రూ. 64.35 లక్షల విలువైన డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్స్ సరఫరా చేస్తున్న ఐదుగురు నిందితులను పోలీసులు చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను టాస్క్‌ఫోర్స్ డీసీపీ వైభవ్ గైక్వాడ్ మంగళవారం మీడియా సమావేశంలో వెల్లడించారు. నగరంలో డ్రగ్స్ మహమ్మారిని రూపుమాపేందుకు ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతలో భాగంగా ఈ దాడులు నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. పోలీసులు జరిపిన ఈ ఆపరేషన్‌లో భారీ మొత్తంలో మత్తుపదార్థాలతో పాటు నిందితుల వద్ద ఉన్న రూ. 50వేల నగదును సీజ్ చేశారు. వీటితో పాటు డ్రగ్స్ రవాణాకు ఉపయోగిస్తున్న ఒక ద్విచక్ర వాహనం మరియు ఐదు మొబైల్ ఫోన్లను కూడా స్వాధీనం చేసుకున్నారు. నిందితులు రహస్యంగా మత్తుపదార్థాలను విక్రయిస్తున్నారనే పక్కా సమాచారంతో టాస్క్‌ఫోర్స్ మరియు లోకల్ పోలీసులు ఏకకాలంలో దాడులు నిర్వహించి వీరిని పట్టుకున్నారు. నిందితుల నెట్‌వర్క్ ఎంతవరకు విస్తరించి ఉందనే కోణంలో ప్రస్తుతం లోతైన విచారణ జరుపుతున్నామని, ఈ గొలుసుకట్టులో ఉన్న మరికొందరిని త్వరలోనే అరెస్టు చేస్తామని డీసీపీ స్పష్టం చేశారు. నిందితుల నేపథ్యం గురించి పోలీసులు ఆసక్తికర విషయాలను వెల్లడించారు. పట్టుబడిన ఐదుగురు నిందితులు గతంలో గౌరవప్రదమైన ఉద్యోగాలు చేసినవారేనని ప్రాథమిక విచారణలో తేలింది. ఆ తర్వాత వారంతా కలిసి టైల్స్ వ్యాపారాన్ని ప్రారంభించారని, అయితే అందులో భారీగా నష్టాలు రావడంతో సులభంగా డబ్బు సంపాదించే మార్గాలను వెతికారని డీసీపీ వివరించారు. ఈ క్రమంలోనే వారు డ్రగ్స్ మాఫియాతో చేతులు కలిపి మత్తుపదార్థాల విక్రయాల్లోకి దిగారు.

వేద న్యూస్

బుధవారం ఏప్రిల్ 08, 2026

# ఎన్ఎస్ఎస్ శిబిరాన్ని సందర్శించిన డా. అనితా రెడ్డి

**వేద న్యూస్, హనుమకొండ:**



హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం నాగారం గ్రామంలో కాకతీయ విశ్వవిద్యాలయం బయోటెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 7 రోజుల ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరాన్ని డా. అనితా రెడ్డి సందర్శించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు యూనిఫాం లేని నిజమైన సైనికులని, సమాజ సేవలో వారి పాత్ర గొప్పదని పేర్కొన్నారు. యువత గ్రామీణ అభివృద్ధిలో భాగస్వాములై సమాజానికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. శిబిరంలో భాగంగా నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించగా, సుమారు 200 మంది గ్రామస్తులు సేవలను వినియోగించుకున్నారు. సేవలందించిన వైద్యులను ఆమె సన్మానించారు. అలాగే పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. శిబిరంలో విద్యార్థులు చేసిన సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ రాధిక, వైద్యులు, ఎన్ఎస్‌ఎస్ వాలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# కనగర్తిలో చలివేంద్రం ఏర్పాటు



**వేద న్యూస్, ఇల్లందకుంట:**

ఇల్లందకుంట మండల పరిధిలోని కనగర్తి గ్రామ పంచాయతీ ఆఫీసు ఎదుట ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేశారు. సదరు చలివేంద్రాన్ని మంగళవారం గ్రామ సర్పంచ్ రామంచ సంపత్, వార్డు సభ్యులు, కార్యదర్శి క్రాంతి కుమార్ గ్రామస్తులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ఊరి ప్రజలతో పాటు బాటసారులకు ప్రస్తుత వేసవికాలం దృష్ట్యా.. దాహార్తి తీర్చాలని సదుద్దేశంతో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. గ్రామస్తులు, వాహనదారులు, ఎవరైనా సరే ప్రస్తుత ఎండాకాలం నేపథ్యంలో సమృద్ధిగా నీరు సేవించాలని సూచించారు. వివిధ రకాల వ్యవసాయ పనుల నిమిత్తం వెళ్లేవారు తాగునీరు అధిక మొత్తంలో తీసుకోవడం ఉత్తమమని చెప్పారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి

## – మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్



**వేద న్యూస్, కాజీపేట:**

గత పది సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలోనే కాజీపేట ప్రాంతంలో అభివృద్ధి పనులు పూర్తయ్యాయని మాజీ కార్పొరేటర్, బీఆర్ఎస్ నాయకుడు జోరిక రమేష్ తెలిపారు. మంగళవారం కాజీపేటలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్లలో హామీలు అమలు చేయలేక ప్రజల్లో విశ్వాసం కోల్పోయిందని, అందుకే అభివృద్ధి పేరుతో ఆర్భాటం చేస్తోందని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో కాజీపేటలో కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసినట్లు తెలిపారు. కాజీపేట బ్రిడ్జి నిర్మాణం కూడా అప్పుడే ప్రారంభమై ఎక్కువ శాతం పూర్తయిందని, ప్రస్తుతం పనులు నత్తనడకన సాగుతున్నాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 6 గ్యారంటీలను అమలు చేయాలని, ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. అవసరమైతే మున్సిపల్ ఎన్నికలకు వెళ్లి ప్రజా తీర్పు తీసుకోవాలని సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

**వేద న్యూస్, రుద్రూర్ :**



రైతులు దళారులకు ధాన్యం విక్రయించి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని ఉమ్మడి మండలాల ఏఎంసీ చైర్మన్ సురేష్ బాబా పేర్కొన్నారు. సోమవారం రుద్రూర్ మండల కేంద్రంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఉమ్మడి మండలాల ఏఎంసీ చైర్మన్ సురేష్ బాబా, తహశీల్దార్ తారాబాయి స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ ఆయన మాట్లాడుతూ.. రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏ. గ్రేడ్ రకానికి రూ. 2389, బి.గ్రేడ్ రకానికి రూ. 2369 క్వింటలుకు మద్దతు ధర అందించి కొనుగోలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఇందూరు సునీత చంద్రశేఖర్, ఉప సర్పంచ్ షేక్ నిస్సార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తోట అరుణ్ కుమార్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఇందూరి చంద్రశేఖర్, మాజీ జడ్పిటీసీ నారోజీ గంగారా, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పార్వతి ప్రవీణ్, సొసైటీ సెక్రెటరీ గంగాధర్, నాయకులు కర్క అశోక్, అక్కపల్లి నాగేందర్, పట్టేపు రాములు, వడ్ల నరేష్ , బర్ల చిట్టి ,రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్య కేంద్రాలలో మెరుగైన వైద్య సేవలు అందించాలి

**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి :**

ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు.స్థానిక వెంకటేశ్వర నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసి, ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, సిబ్బంది హాజరు, మందుల నిల్వలు, ల్యాబ్, మెడికల్ వార్డ్, టాయిలెట్లు, శుభ్రత తదితర అంశాలను కలెక్టర్ పరిశీలించారు. ఆసుపత్రిలో అవసరమైన ఔషధాల లభ్యతపై ప్రత్యేకంగా విచారించి, అన్ని రకాల అవసరమైన మందులను తగిన స్థాయిలో నిల్వ ఉంచాలని ఆదేశించారు. ఆసుపత్రి రిజిస్టర్లన్నింటినీ స్వయంగా పరిశీలించి, రోగులకు అందుతున్న సేవలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.ల్యాబ్ పరీక్షలు, డయాగ్నస్టిక్ హబ్ సేవల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని, అన్ని పరీక్షల రిపోర్ట్ లను వీలైనంత త్వరగా రోగులకు అందించాలని ఆదేశించారు. రోగులకు సమయానికి సరైన చికిత్స అందించడంతో పాటు అవసరమైన అన్ని రకాల ఔషధాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఆసుపత్రి పరిసరాలను శుభ్రంగా ఉంచి, రోగులకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించాలని అన్నారు. సిబ్బంది సమయపాలన పాటిస్తూ బాధ్యతగా విధులు నిర్వర్తించాలని తెలిపారు. జిల్లాలోని ప్రతి పి.హెచ్.సి., అర్బన్ పి.హెచ్.సి. లలో పనిచేస్తున్న వైద్య సిబ్బంది వివరాలను సమగ్రంగా సమర్పించాలని, ప్రతి కేంద్రంలో మంజూరు చేసిన పోస్టులు, ప్రస్తుతం పనిచేస్తున్న సిబ్బంది, ఖాళీల వివరాలను స్పష్టంగా తెలియజేయాలని, ఈ నివేదిక ఆధారంగా జిల్లాలో సిబ్బంది ఎక్కడ తక్కువగా ఉన్నారో గుర్తించి తక్షణమే సరి చేయడానికి అవకాశం ఉంటుందని, డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న సిబ్బంది సంఖ్యను కూడా ఖచ్చితంగా ధృవీకరించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ ఏఓ డాక్టర్ మోత్యను ఆదేశించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట వైద్యాధికారిణి ఐ. దేవి శ్రీ, నర్సింగ్ అధికారిణి సయ్యద్ షమీమ్, ఫార్మసిస్ట్ ఎస్.కే. ముదస్సర్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



– కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

# గుంపెల్లగూడెం గ్రామ అభివృద్ధికి కీలక అడుగు

**వేద న్యూస్, కారేపల్లి :**



– ఎంపీని కలిసిన సర్పంచ్ కృష్ణవేణి

గుంపెల్లగూడెం గ్రామ సర్పంచ్ గుగులోత్ కృష్ణవేణి వీరబాబు, మంగళవారం ఎంపీని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ సమగ్ర అభివృద్ధికి సంబంధించిన ప్రధాన సమస్యలు, అవసరాలు మరియు ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎంపీ దృష్టికి తీసుకువెళ్లారు. గ్రామానికి అత్యవసరమైన మౌలిక సదుపాయాల అభివృద్ధి, తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం, విద్యా మరియు ఆరోగ్య రంగాల బలోపేతానికి తగిన నిధులు, సహకారం అందించాలని వినతిపత్రం సమర్పించారు. గ్రామ ప్రజల సంక్షేమం దృష్ట్యా వివిధ సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాల్సిన అవసరాన్ని కూడా వివరించారు. అదేవిధంగా, సీఎం రిలీఫ్ ఫండ్ కార్యక్రమంలో చురుకుగా పాల్గొని తమ సేవాభావాన్ని చాటుకున్నట్లు తెలిపారు. ప్రజల కోసం నిరంతరం కృషి చేస్తున్న నాయకులుగా కృష్ణవేణి వీరబాబు సేవలను స్థానికులు అభినందిస్తున్నారు. గుంపెల్లగూడెం గ్రామ అభివృద్ధికి ఈ సమావేశం ఒక ముఖ్యమైన ముందడుగు కావాలని గ్రామ ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

**వేద న్యూస్, మందమర్రి :**




శ్రీ చైతన్య స్కూల్‌లో 5వ తరగతి విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఎంతో ఘనంగా, ఆనందోత్సాహాల మధ్య నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో చిన్నారులు ప్రత్యేక గ్రాడ్యుయేషన్ గౌన్లు, క్యాప్స్ ధరించి ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, 5వ తరగతి పూర్తి చేసి ఉన్నత తరగతుల వైపు అడుగులు వేస్తున్న విద్యార్థులకు ఇది ఒక మధురమైన మైలురాయి అని తెలిపారు. విద్యార్థులు భవిష్యత్తులో మరింత క్రమశిక్షణతో చదువులో రాణించి, తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు, పాటలు ప్రదర్శించి అందరినీ అలరించారు. విద్యార్థుల ప్రతిభను అభినందిస్తూ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు వారికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ వేడుకలో భాగంగా విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికేట్లు, జ్ఞాపికలు అందజేశారు. పిల్లల ఆనందం, తల్లిదండ్రుల గర్వభావం, ఉపాధ్యాయుల ఆశీర్వాదాలతో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, కోఆర్డినేటర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# చిరుతపులి దాడిలో దూడ మృతి

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డు చిన్నబోనాల శివారులో చిరుతపులి దాడి చేసింది. ఈ ఘటనలో బోనాల ముత్యంరాజు అనే రైతుకు చెందిన సుమారు రూ.30 వేల విలువ గల దూడ మృతి చెందింది. పశుపోషణపై ఆధారపడి జీవిస్తున్న రైతుకు ఈ నష్టం తీవ్రంగా తాకిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వార్డు కౌన్సిలర్ బొల్గం వైష్ణవి నాగరాజు స్పందిస్తూ, బాధిత రైతుకు ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. అటవీ శాఖ అధికారులు వెంటనే స్పందించి చిరుత సంచారాన్ని అరికట్టాలని కోరారు. అలాగే పరిసర ప్రాంతాల రైతులు, పశువుల కాపరులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



# పేదల పెన్నిధి సీఎం రిలీఫ్ ఫండ్

**వేద న్యూస్,కారేపల్లి :**



ఆపదలో ఉన్న పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఒక వరమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అండగా ఉంటుందని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురామ రెడ్డి అన్నారు. మంగళవారం సింగరేణి మండల పరిధిలోని లబ్ధిదారులకు ఆయన చేతుల మీదుగా చెక్కులను పంపిణీ చేశారు. మొత్తం లబ్ధిదారులు: 36 మంది పంపిణీ చేసిన మొత్తం: రూ. 8,81,500 (ఎనిమిది లక్షల ఎనభై ఒక్క వేల ఐదు వందల రూపాయలు) మండల ప్రజలకు ఏ సమస్య వచ్చినా తాను ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని ఎంపీ భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా మండలంలోని పలువురు సర్పంచ్‌లు తమ గ్రామాల అభివృద్ధికి సంబంధించిన వినతి పత్రాలను ఎంపీకి అందజేశారు. గ్రామాల అభివృద్ధికి కావాల్సిన నిధులు, సౌకర్యాల విషయంలో సానుకూలంగా స్పందించిన ఆయన, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు ఇమ్మడి తిరుపతి రావు, అజ్మీరా నరేష్‌లతో పాటు సర్పంచ్‌లు అజ్మీరా ఉమా నరేష్, వడ్డే సులోచన రంగారావు, మోతీ వీరస్వామి, ధారావత్ వెంకటేశ్వర్లు, గూగులోతు కృష్ణవేణి వీరబాబు, దండు ప్రవీణ్, ఉండం రాఘవులు, దరావత్ హేమ, గూగులోతు వరలక్ష్మి, కొమ్ము భద్రం, బానోత్ రూప్లా నాయక్, పొడుగు పెంటయ్య, మండల అధ్యక్షులు తలారి చంద్ర ప్రకాష్, పాటి నర్సయ్య, వార్డు మెంబర్ దారావత్ రమేష్ నాయక్,ఆదేర్ల అంజయ్య, తోగర శ్రీను, జర్పుల ధోనీ నాయక్, ఈసం లక్ష్మీ నర్సు, హర్ష నాయక్, నరేష్, బద్దె నాయక్, రవీందర్ రెడ్డి, రెడ్డబోయిన జగయ్య, గుంపిడి నాగేశ్వరావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

**వేద న్యూస్, మందమర్రి :**




శ్రీ చైతన్య స్కూల్‌లో 5వ తరగతి విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఎంతో ఘనంగా, ఆనందోత్సాహాల మధ్య నిర్వహించబడ్డాయి. ఈ కార్య క్రమంలో చిన్నారులు ప్రత్యేక గ్రాడ్యు యేషన్ గౌన్లు, క్యాప్స్ ధరించి ఆకట్టు కున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, 5వ తరగతి పూర్తి చేసి ఉన్నత తరగతుల వైపు అడుగులు వేస్తున్న విద్యార్థులకు ఇది ఒక మధురమైన మైలురాయి అని తెలిపారు. విద్యార్థులు భవిష్యత్తులో మరింత క్రమశిక్షణతో చదువులో రాణించి, తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు, పాటలు ప్రదర్శించి అందరినీ అలరించారు. విద్యార్థుల ప్రతిభను అభినందిస్తూ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు వారికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ వేడుకలో భాగంగా విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికేట్లు, జ్ఞాపికలు అందజేశారు. పిల్లల ఆనందం, తల్లిదండ్రుల గర్వభావం, ఉపాధ్యాయుల ఆశీర్వాదాలతో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, కోఆర్డినేటర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# సిటీ కళాశాలలో ఘనంగా 'మహనీయుల జయంతి'

- విద్య ద్వారానే సామాజిక మార్పు సాధ్యం
- ప్రొఫెసర్ లింబాద్రి



**వేద న్యూస్, హైదరాబాద్:**

డా. బి.ఆర్. అంబేద్కర్, మహాత్మా జ్యోతిరావు పూలే, బాబూ జగ్జీవన్ రామ్ జయంతులను పురస్కరించుకుని ప్రభుత్వ సిటీ కళాశాల సోషల్ సైన్సెస్ విభాగం ఆధ్వర్యంలో 'మహనీయుల జయంతి' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉన్నత విద్యామండలి పూర్వాధ్యక్షులు ప్రొఫెసర్ లింబాద్రి హాజరుకాగా, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సిహెచ్. ప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ లింబాద్రి మాట్లాడుతూ, జ్యోతిరావు పూలే మహిళా విద్యకు మార్గదర్శకుడని, విద్య ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమని తెలిపారు. పూలే దంపతుల కృషి వల్లే నేడు మహిళల విద్యాభివృద్ధి గణనీయంగా పెరిగిందన్నారు. ప్రొఫెసర్ ప్రసాద్ మాట్లాడుతూ మహనీయుల ఆశయాలను విద్యార్థులకు చేరువ చేయడం అవసరమని అన్నారు. తెలుగు శాఖాధ్యక్షులు డా. కోటేశ్వరరావు మాట్లాడుతూ.. అంబేద్కర్ రాజ్యాంగం వల్లే సమాన అవకాశాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శాంతి, అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బాలికల ఆరోగ్యం.. దేశానికి రక్షణ

- హెచ్పీవీ వ్యాక్సిన్ పై అవగాహన
- అల్లు అర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్ వినూత్న కార్యక్రమం

**వేద న్యూస్, శాయంపేట:**




అల్లు అర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళల్లో గర్భాశయ (సర్వైకల్) క్యాన్సర్ నివారణపై అవగాహన కల్పించే గోడపత్రికను భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, 9 నుంచి 14 ఏళ్ల బాలికలకు హెచ్పీవీ వ్యాక్సిన్ వేయించడం ద్వారా భవిష్యత్తులో వచ్చే గర్భాశయ క్యాన్సర్‌ను సమర్థవంతంగా నివారించవచ్చని తెలిపారు. సమాజానికి ఉపయోగపడే ఇలాంటి సేవా కార్యక్రమాలు అభినందనీయం అని పేర్కొన్నారు. అభిమానం అంటే కేవలం బ్యానర్లు, వేడుకలు మాత్రమే కాకుండా సామాజిక సేవ చేయడం కూడా కావాలని అన్నారు. ఈ కార్యక్రమాన్ని చేపట్టిన అల్లు అర్జున్ అభిమాన సంఘాన్ని ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో అభిమాన సంఘం సభ్యులు, నడిగోట్టు రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

# నిత్యావసర సరుకులు పారదర్శకంగా అందిస్తున్నం

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

**వేద న్యూస్, శాయంపేట:**



శాయంపేట మండలం మాందారిపేట గ్రామంలో బడుగు అశోక్‌కు చెందిన నూతన రేషన్ షాపును భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం పేద ప్రజలకు నిత్యావసర సరుకులను సమయానికి, పారదర్శకంగా అందిస్తున్నదని తెలిపారు. గ్రామ స్థాయిలో రేషన్ దుకాణాల ఏర్పాటు ద్వారా ప్రజలకు సులభంగా సరుకులు అందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. మాందారిపేట గ్రామ ప్రజలకు ఈ కొత్త రేషన్ షాప్ ఎంతో ఉపయోగకరంగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాలు చేరేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో నారాయణ, ఎమ్మార్వో రోకుల ప్రవీణ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# స్మిత్సోనియన్ ఫోటోగ్రఫీ పోటీలో మెరిసిన అరుణ్ కుమార్ చిత్రం





**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి:**

ప్రతిష్టాత్మకమైన 'స్మిత్సోనియన్' మ్యాగజైన్ అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన ఫోటోగ్రఫీ పోటీలో భారతదేశం తరపున తెలంగాణలోని భూపాలపల్లికి చెందిన ఫోటోగ్రాఫర్ చెందిన అరుణ్ నలిమెల తీసిన ఫోటో ఎంపికైంది. తన అద్భుతమైన ప్రతిభతో అరుణ్ అంతర్జాతీయ వేదికపై తెలుగు రాష్ట్రాల ఖ్యాతిని చాటారు. తద్వారా అరుణ్ ఫోటోగ్రఫీ ప్రతిభకు అంతర్జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు లభించింది. వారణాసిలో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా భక్తులు వెలిగించిన ప్రమిదల మధ్య ఒక మహిళ నడుచుకుంటూ వెళ్తున్న దృశ్యాన్ని అరుణ్ తన కెమెరాలో బంధించారు. సిటీ ఆఫ్ లైట్స్ అనే శీర్షికతో అరుణ్ క్లిక్ చేసిన ఈ ఫోటో ప్రపంచం నలుమూలల నుంచి వచ్చిన వేలాది ఎంట్రీల మధ్య ప్రత్యేకంగా నిలిచింది.

**ఈ ఫోటో గురించి అరుణ్ మాట్లాడుతూ**

మనం పూర్తి భక్తితో సంస్కృతిని చిత్రీకరించినప్పుడు, కొన్ని అద్భుతమైన చిత్రాలు దానంతట అవే మనకు లభిస్తాయి. ఈ ఫోటో కూడా అలా దేవుడు ఇచ్చిన కానుక లాంటిదే," అని అరుణ్ పేర్కొన్నారు. సోదరుడి స్ఫూర్తితో మొదలైన ప్రయాణం తెలంగాణకు చెందిన 33 ఏళ్ల అరుణ్, 2013లో తన అన్నయ్య స్ఫూర్తితో ఫోటోగ్రఫీని హాబీగా మొదలుపెట్టారు. మొదట్లో వన్యప్రాణుల ఫోటోలు తీసే అరుణ్, ఆ తర్వాత తన దృష్టిని భారతీయ సంస్కృతి వైపు మళ్లించారు. గతంలో ప్రధాని నరేంద్ర మోదీ మన్ కి బాత్ కార్యక్రమంలో అరుణ్ ఫోటోగ్రఫీని అభినందించారు. అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన అరుణ్ ను పలువురు ఫోటోగ్రాఫర్లు అభినందించారు.

# ఎమ్మెల్యే చొరవతో రైతుల్లో చిగురిస్తున్న ఆశలు

**వేద న్యూస్,కారేపల్లి:**




సింగరేణి మండల పరిధిలోని రైల్వే డబుల్ లైన్ నిర్మాణానికి సంబంధించి భూ నిర్వాసితుల పరిహారం అంశం కీలక మలుపు తిరిగింది. డోర్నకల్ నుండి భద్రాచలం రోడ్ వరకు ప్రతిపాదించిన ఈ ప్రాజెక్టులో భూములు కోల్పోతున్న కోమట్లగూడెం గేట్, కారేపల్లి, మరియు కమలాపురం రెవెన్యూ పరిధిలోని రైతులకు న్యాయం చేసేందుకు అధికార యంత్రాంగం మరియు ప్రజా ప్రతినిధులు రంగంలోకి దిగారు. ఇటీవల కలెక్టర్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో భూ నిర్వాసిత రైతులు తమ గోడును వెళ్లబోసుకున్నారు. ఎకరాకు రూ. 19 లక్షల పరిహారం చెల్లించాలని రైతులు పట్టుబట్టగా, కలెక్టర్ శ్రీజ ఆదేశాల మేరకు రూ. 18 లక్షల వరకు ఇచ్చే అవకాశం ఉందని అధికారులు ప్రాథమికంగా వెల్లడించారు. అయితే, మధ్యేమార్గంగా ఎకరాకు రూ. 18.50 లక్షలు ఇస్తేనే భూములు ఇచ్చేందుకు సిద్ధమని రైతులు తమ స్పష్టమైన నిర్ణయాన్ని ఎస్‌డీసీ శ్రీజ కి వినతిపత్రం ద్వారా సమర్పించారు. రంగంలోకి వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ రైతుల విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, ఈ సమస్య పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపారు. సింగరేణి మండల రైతులతో జరిగిన సమావేశంలో ఆయన స్వయంగా కలెక్టర్‌తో ఫోన్ ద్వారా మాట్లాడారు. భూ నిర్వాసితులకు గరిష్ట పరిహారం అందేలా చూడాలని, రైతులకు అన్యాయం జరగకుండా త్వరితగతిన 'అవార్డు' కన్ఫామ్ చేయాలని ఆయన కోరారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించిన నేపథ్యంలో, గాదెపాడు సర్పంచ్ భూక్యా రంజిత్ కుమార్ నేతృత్వంలో మూడు రెవెన్యూ పరిధుల రైతులు జాయింట్ కలెక్టర్ శ్రీజను కలిశారు. ఎమ్మెల్యే సమక్షంలోనే బాధితులందరితో కలిసి మరో దఫా సమావేశం నిర్వహించి, అధికారికంగా పరిహారం (అవార్డు) ప్రకటించాలని వారు విన్నవించారు. ఈ సమావేశంలో కమలాపురానికి చెందిన కోటి అప్పారావు, పాండియా నాయక్, పలువురు మహిళా రైతులు మరియు నిర్వాసితులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే చొరవతో పరిహారం పెంపుపై సానుకూల నిర్ణయం వస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి

- కార్మికులకు చీరల పంపిణీ చేసిన 40డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు మీర్జా అక్తర్

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**



ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని 40వ డివిజన్ అధ్యక్షుడు మీర్జా అక్తర్ పారిశుద్ధ్య మహిళా కార్మికులకు చీరలు పంపిణీ చేయడం జరిగింది. సమాజ ఆరోగ్యానికి పునాది వేస్తున్న పారిశుద్ధ్య మహిళ కార్మికుల సేవలను గుర్తించడం చాలా అవసరమని ప్రతి రోజూ శుభ్రత కోసం శ్రమిస్తున్న మహిళా కార్మికులు నిజమైన ఆరోగ్య యోధులు అని అక్తర్ పేర్కొన్నారు.వారి కష్టానికి గౌరవం ఇవ్వడం సమాజ బాధ్యతని మహిళల ఆత్మగౌరవాన్ని పెంపొందించే ప్రయత్నమని చెప్పారు.మహిళా సాధికారతకు ఇలాంటి చర్యలు బలమైన పునాది వేస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. పారిశుద్ధ్య కార్మికులు సమాజానికి అనేక సేవలు అందిస్తున్నారని ఆయన కొనియాడారు.వారి ఆరోగ్యం, భద్రత పట్ల ప్రతి ఒక్కరూ శ్రద్ధ చూపాలని సూచించారు.ఈ సందర్భంగా ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల. కుమారస్వామి (రవి) మాట్లాడుతూ అక్తర్ దాతృత్వాన్ని ప్రశంసించారు. సమాజంలో సేవా భావం కలిగిన నాయకులు అరుదుగా ఉంటారని ఆయన అన్నారు.మహిళా కార్మికుల సంక్షేమం కోసం చేపట్టిన ఈ కార్యక్రమం ఆదర్శప్రాయమని, స్ఫూర్తిగా నిలవాలని ఆశాభావం వ్యక్తం చేశారు.మహిళల ఆర్థిక, సామాజిక స్థితిని మెరుగుపరచడంలో ఇలాంటి సహాయాలు కీలకమని తెలిపారు.ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమం మరింత ప్రాముఖ్యత సంతరించుకుందని అన్నారు.ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజంలో సానుకూల మార్పులకు దారి తీస్తాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తోట సతీష్, న్యాలపోగుల ప్రశాంత్, లడ్డు, జమాన్ కృష్ణ, పారిశుద్ధ్య మహిళా కార్మికులు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్ యూజే(ఐ) నేషనల్ సెమినార్ పోస్టర్ ఆవిష్కరణ

**వేద న్యూస్, జనగామ :**




ఈ నెల 23, 24వ తేదీల్లో హైదరాబాద్ లో జరుగుతున్న ఎన్ యూజే(ఐ) జాతీయ సెమినార్ పోస్టర్ ను వెస్ట్ జోన్ డీసీపీ రాజ మహేందర్ నాయక్ ఆవిష్కరించారు. జనగామలోని డీసీపీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో టీఎస్ జెయూ జనగామ జిల్లా అధ్యక్షుడు ఉప్పలంచి నరేందర్, కార్యదర్శి గన్ను కార్తీక్, గౌరవ అధ్యక్షుడు శివకుమార్, ఉపాధ్యక్షుడు గుడికందుల కృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ తుంగ కౌశిక్, కార్యవర్గ సభ్యులు రేణుకుంట్ల మురళి, పెట్లోజు సోమేశ్వరాచారి పాల్గొన్నారు.

వేద న్యూస్



# ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మజ్జిగ పంపిణీ

**- డా. ఏ. రాజేంద్రప్రసాద్ భారతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో..**

**వేద న్యూస్, వరంగల్:**

ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా వరంగల్ రామన్నపేటలోని ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రిలో డా. ఏ. రాజేంద్రప్రసాద్ భారతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజింగ్ ట్రస్టీ డా. రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని, ముఖ్యంగా వేసవిలో శుభ్రమైన ఆహారం, తగినంత నీరు తీసుకోవడం ద్వారా అనారోగ్యాలను నివారించవచ్చని తెలిపారు. రోజుకు 2 నుంచి 5 లీటర్ల నీరు తాగడం ఆరోగ్యానికి మంచిదని సూచించారు. మజ్జిగ ప్రోబయోటిక్‌గా పనిచేసి జీర్ణక్రియను మెరుగు పరుస్తుందని, శరీరాన్ని చల్లగా ఉంచుతుందని చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా ఆసుపత్రిలో ఉన్న రోగులకు ఆరోగ్య పరిరక్షణలో భాగంగా మజ్జిగ పంపిణీ చేసినట్లు తెలిపారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. హరికిషన్ నాయక్ మాట్లాడుతూ, ఇలాంటి సేవా కార్యక్రమాలు అభినందనీయం అని



అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కష్టమొస్తే కబురు పెట్టండి




మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సభ్యులు పెరుక రంగయ్య

**- ఇటుక బట్టీ కార్మికులకు న్యాయ సేవా సంస్థ భరోసా**

**వేద న్యూస్, రామడుగు:**

ఇటుక బట్టీలలో పనిచేసే కార్మికులకు ఎవరైనా ఇబ్బందులు కలిగిస్తే వెంటనే సమాచారం అందించి న్యాయ సలహాలు పొందవచ్చని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ సూచించింది. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మంగళవారం వెలిచాల గ్రామంలో న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో కార్మికులకు న్యాయ అవగాహన కార్యక్రమంతో పాటు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమం సీనియర్ సివిల్ జడ్జి కే. రాణి ఆదేశాల మేరకు జరిగింది. ఈ సందర్భంగా కనీస వేతనాలు, భద్రత ప్రమాణాలు, కార్మిక హక్కులపై అవగాహన కల్పించారు. కార్మికులు తమ హక్కులను తెలుసుకొని అవసరమైతే న్యాయ సహాయం పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్మిక శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# ఏప్రిల్ 17న కలెక్టరేట్ల వద్ద నిరసనలు

**- మే 5న జిల్లా కేంద్రాల్లో ఆందోళనలు**
**- ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల జేఏసీ నిర్ణయం**

**వేద న్యూస్, మెట్‌పల్లి:**

తెలంగాణ ఉద్యోగ, గెజిటెడ్ అధికారుల, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల ఐక్య కార్యాచరణ సమితి (టీజీఈజేఏసీ) విస్తృత స్థాయి సమావేశం ట్రెసా ఆధ్వర్యంలో హైదరాబాద్ మూసారంబాగ్‌లోని రెవెన్యూ భవన్‌లో జరిగింది. ట్రెసా రాష్ట్ర అధ్యక్షుడు వంగ రవీందర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. జేఏసీ తీర్మానాల ప్రకారం, ఏప్రిల్ 17న అన్ని మండల, జిల్లా కలెక్టరేట్ల వద్ద భోజన విరామ సమయంలో నిరసన ప్రదర్శనలు చేపట్టాలని, మే 5న అన్ని జిల్లా కేంద్రాల్లో ఒక రోజు నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. ఉద్యోగుల 57 డిమాండ్లలో ముఖ్యంగా 6 ప్రధాన అంశాలపై చర్చించారు. వాటిలో వెంటనే పీఆర్‌సీ అమలు, సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు, రిటైర్డ్ ఉద్యోగుల బకాయిల చెల్లింపు, పెండింగ్ డీఏలు విడుదల, 13వేల కోట్ల



పెండింగ్ బిల్లుల చెల్లింపు వంటి అంశాలు ఉన్నాయి. అలాగే ఏకీకృత సర్వీస్ రూల్స్ అమలు, జీఓ 317 బాధితులకు న్యాయం, ఉద్యోగ సంఘాల భవనాలపై ప్రాపర్టీ టాక్స్ రద్దు వంటి డిమాండ్లను కూడా సమావేశంలో ప్రస్తావించారు. ఈ సమావేశంలో జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు, ట్రెసా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల సర్వేలో తీవ్ర లోపాలు



**- బీఎల్ఓల నిర్లక్ష్యమే కారణం**
**- జనసేన నేత బేతి మహేందర్ రెడ్డి**

**వేద న్యూస్, కరీంనగర్:**

డివిజన్ల మ్యాపింగ్ పేరుతో నిర్వహిస్తున్న ఓటరు సర్వేలో తీవ్ర లోపాలు ఉన్నాయని జనసేన పార్టీ పార్లమెంట్ కో-ఆర్డినేటర్ బేతి మహేందర్ రెడ్డి విమర్శించారు. దీనికి ప్రధాన కారణం అధికారుల నిర్లక్ష్యమేనని ఆరోపించారు. బూత్ లెవల్ ఆఫీసర్లు (బీఎల్ఓలు) గడపగడపకు వెళ్లి వివరాలు సరిచూడాల్సి ఉండగా, స్థానికంగా ఒకేచోట కూర్చుని మ్యాపింగ్ నిర్వహిస్తూ తప్పుడు నివేదికలు సిద్ధం చేస్తున్నారని పేర్కొన్నారు. దీంతో డివిజన్లలో ఓట్ల గల్లంతు జరుగుతోందని తెలిపారు. బతికున్న వారి ఓట్లు తొలగించడం, మరణించిన వారి పేర్లు కొనసాగించడం, ఒకే కుటుంబ ఓట్లు వేర్వేరు డివిజన్లలో నమోదు కావడం, డబుల్ ఓట్లు, పేరు-ఫోటో తేడాలు వంటి అనేక లోపాలు ఉన్నాయని వెల్లడించారు. ఈ పరిస్థితులు ఎన్నికల వ్యవస్థపై ప్రజల్లో అనుమానాలు పెంచుతున్నాయని అన్నారు. మున్సిపల్ ఎన్నికల ముందు వచ్చిన ఫిర్యాదులను పట్టించుకోకపోవడం వల్ల పోలింగ్ శాతం తగ్గిందని విమర్శించారు. ఈ విషయానికి బీఎల్ఓలతో పాటు జిల్లా యంత్రాంగం కూడా బాధ్యత వహించాల్సిందేనని స్పష్టం చేశారు. దొంగ, డబుల్ ఓట్ల సమస్యను అరికట్టేందుకు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కఠినంగా అమలు చేయాలని, ఓటరు కార్డును ఆధార్‌తో అనుసంధానం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని హెచ్చరించారు.

# రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్ల తొలగింపు

**- మడికొండ పోలీసుల చర్యతో ప్రమాదాల నివారణకు దోహదం**

**వేద న్యూస్, మడికొండ:**

మడికొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని హనుమకొండ-హైదరాబాద్ జాతీయ రహదారి 163పై రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్లు, గుబురుగా పెరిగిన మొక్కలను మడికొండ పోలీసులు తొలగించారు. డివైడర్ మధ్య యూ-టర్న్ ప్రాంతాలు, మూల మలుపుల వద్ద చెట్లు పెరగడం వల్ల వాహనదారులకు స్పష్టత లేక ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో సీఐ పుల్యాల కిషన్ సిబ్బందితో కలిసి ఈ చర్యలు చేపట్టారు. ముఖ్యంగా మెయిన్ రోడ్డు, రొట్టెబండ, మడికొండ ఇండస్ట్రియల్ ఏరియా, అయోధ్యపురం క్రాస్ రోడ్ ప్రాంతాల్లో చెట్లను తొలగించారు. ఈ చర్యలతో వాహనదారులకు రహదారి స్పష్టంగా కనిపించి ప్రమాదాలు తగ్గుతాయని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రాజ్‌కుమార్, పోలీసు సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



# ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి

**- నాణ్యతా ప్రమాణాలతో సేకరించాలి**
**- రైతులకు ఇబ్బందులు కలగొద్దు - కలెక్టర్ గరిమ అగ్రవాల్**




**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

యాసంగి సీజన్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో మంగళవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఏపీఎంలు, ఐకేపీ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, బుక్ కీపర్లకు మార్గదర్శకాలు ఇచ్చారు. గ్రేడ్-ఏ రకం ధాన్యానికి క్వింటాలుకు రూ.2,389, కామన్ రకానికి రూ.2,369 ధరను ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఈ సీజన్‌లో జిల్లాలో సుమారు 3 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రానుందని పేర్కొన్నారు. జిల్లాలో ఏర్పాటు చేసే 136 కొనుగోలు కేంద్రాల్లో టెంట్లు, తాగునీరు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, తూకం యంత్రాలు, తేమ కొలిచే పరికరాలు, టార్పాలిన్లు, గన్ని బ్యాగులు సమృద్ధిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటిస్తూ, ఏఈఓ ధృవీకరణ తర్వాతే ధాన్యం కొనుగోలు చేయాలని ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన రైస్ మిల్లులకు మాత్రమే పంపించాలని, అన్ని వివరాలను ఆన్లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు రాకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, డీఆర్డీఓ గీత, పౌర సరఫరాల శాఖ అధికారులు, ఏపీఎంలు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు పాల్గొన్నారు.

# సిరిసిల్ల సిక్‌వాడలో నాకాబందీ

**- ప్రతి ఇంట్లో తనిఖీలు**
**- వాహనాలు, మద్యం స్వాధీనం**



**వేద న్యూస్, సిరిసిల్ల:**

సిరిసిల్ల పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసులు సిక్‌వాడ ప్రాంతంలో విస్తృత నాకాబందీ నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మంగళవారం డీఎస్పీ నాగేంద్రచారి ఆధ్వర్యంలో ఈ తనిఖీలు చేపట్టారు. తనిఖీలలో సరైన పత్రాలు, నంబర్ ప్లేట్లు లేని 23 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరిపై కేసులు నమోదు చేసి సుమారు 14 లీటర్ల మద్యం పట్టుకున్నారు. మాదకద్రవ్యాల నియంత్రణలో భాగంగా నార్కోటిక్ డాగ్స్‌తో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు. ప్రజలు అనుమానాస్పద వ్యక్తులపై వెంటనే సమాచారం ఇవ్వాలని, కాలనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్, ఎస్ఐలు శ్రీకాంత్, ఉపేందర్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# రాత్రయితే గ్రానైట్ లారీల జోరు

**- అతివేగంతో ప్రజల్లో ఆందోళన**



**వేద న్యూస్, చిగురుమామిడి:**

ప్రాంతంలో రోజురోజుకు గ్రానైట్ లారీల ఆగడాలు పెరుగుతూ ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి. నియమ నిబంధనలు పట్టించుకోకుండా అధిక వేగంతో లారీలు దూసుకెళుతుండటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. హుస్నాబాద్ నుంచి కొత్తపల్లి వరకు, ముఖ్యంగా ముల్కనూర్ గ్రామాల మధ్య రాత్రి వేళల్లో భారీ వాహనాల రాకపోకలు అధికంగా పెరిగాయి. దీంతో రాత్రి సమయంలో ప్రయాణించడం ప్రమాదకరంగా మారింది. లారీల నిరంతర రాకపోకల వల్ల రోడ్లు దెబ్బతినడమే కాకుండా ప్రమాదాలు సంభవించే పరిస్థితి నెలకొంది. విద్యార్థులు, రైతులు, అత్యవసర పనులతో వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలుమార్లు ఫిర్యాదులు చేసినా అధికారులు స్పందించడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే పోలీసులు, రవాణా శాఖ అధికారులు చర్యలు తీసుకుని లారీల రాకపోకలను నియంత్రించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# మాజీ సుడా చైర్మన్ జన్మదిన వేడుకలు ఘనంగా

**వేద న్యూస్, శంకరపట్నం:**




శంకరపట్నం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద మాజీ సుడా చైర్మన్, కరీంనగర్ జిల్లా పార్టీ అధ్యక్షుడు జీవి రామకృష్ణారావు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహిం చారు. మండల అధ్యక్షుడు గంట మహిపాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. జీవి రామకృష్ణారావు పార్టీ అభివృద్ధికి చేసిన సేవలు విశేషమని కొనియాడారు. భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తితో పార్టీకి మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వేద న్యూస్

బుధవారం ఏప్రిల్ 08, 2026

# డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు

**వేద న్యూస్, కాజీపేట:**

కాజీపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ సీఐ వెంకన్న ఆధ్వర్యంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు పట్టుకున్నారు. వారిలో ఇద్దరు వ్యక్తులు మితిమీరిన మద్యం సేవించినట్లు గుర్తించి, గౌరవ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా, మేజిస్ట్రేట్ రాజశేఖర్ రెడ్డి ఇద్దరికీ రెండు రోజుల జైలు శిక్ష విధించారు. జైలు శిక్షకు గురైన పరుస ప్రవీణ్ కుమార్, చీరాల తిరుపతిని హుజురాబాద్ సబ్ జైలుకు తరలించినట్లు ట్రాఫిక్ సీఐ వెంకన్న తెలిపారు.

# ప్రభుత్వ హాస్పిటల్ లో ఫ్రూట్,బ్రెడ్ పంపిణీ

**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి :**



ఖమ్మం జిల్లా నేలకొండపల్లి గల ప్రభుత్వ హాస్పిటల్లో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా అపరమేధావి డా. గుగ్గిళ్ళ దివ్యమూర్తి అభిమానుల సంఘం ఆధ్వర్యంలో రోగులకు పండ్లు,బ్రెడ్ పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అపరమేధావి డాక్టర్ గుగ్గిళ్ల దివ్యమూర్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా గుగ్గిళ్ళ దివ్యమూర్తి మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యం అని ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటేనే ఏ పనులైనా చేసుకోగలుగుతారని తెలియజేశారు. అభిమానుల సంఘం సభ్యులు మాట్లాడుతూ ఇప్పటివరకు 3 వేదికల మీద పండ్లు పంపిణీ చేశామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అభిమానుల జాతీయ సామాజిక సేవా అవార్డు గ్రహీత బొడ్డు బాబురావు,రాష్ట్ర సమన్వయకర్త కట్టెకోలె వెంకటేశ్వర్లు, అభిమానుల సంఘం రాష్ట్ర యూత్ ఉపాధ్యక్షులు వడ్లమూడి శ్రీనివాసరావు, రాయబారపు గురవయ్య, వీరబాబు, తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల ఆరోగ్య సంరక్షణే ధ్యేయం

**వేద న్యూస్, మందమర్రి :**



కార్మికుల ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా సింగరేణి సంస్థ పనిచేస్తుందని అందులో భాగంగానే గనుల వద్ద వేసవి అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని ఆరోగ్య అధికారి డాక్టర్ పి.లోక్నాథ్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ రాధాకృష్ణ, డివై సీఎమ్ఓ మధుకుమార్ ల ఆదేశానుసారం కెకె-5 గని పై ఉద్యోగులకు వేసవి జాగ్రత్తలపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ లోక్నాథ్ రెడ్డి మాట్లాడుతూ ఎండ తీవ్రత వల్ల కలిగే వడదెబ్బ లక్షణాలను వివరించారు. ఒకవేళ వడదెబ్బకు గురైతే తీసుకోవాల్సిన తక్షణ ప్రథమ చికిత్స గురించి కార్మికులకు క్షుణ్ణంగా వివరించారు.ఎండలు మండిపోతున్న దృష్ట్యా ప్రతి ఒక్కరూ నిరంతరం ద్రవ పదార్థాలను (మంచినీరు, ఓఆర్ఎస్, మజ్జిగ) తీసుకోవాలని సూచించారు. ఆరోగ్యాన్ని దెబ్బతీసే మద్యపానం, ధూమపానానికి ఈ వేసవి కాలంలో ఎంత దూరంగా ఉంటే అంత మంచిదని ఆయన హెచ్చరించారు. అనంతరం గని మేనేజర్ శంభూనాథ్ పాండే, సేఫ్టీ ఆఫీసర్ చీకటి రమేశ్ మాట్లాడుతూ గనిపై పనిచేసే కార్మికులు అధికారుల సూచనలు పాటించి, ఆరోగ్యంగా ఉండాలని కోరారు. రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించడంలో ఆరోగ్యం కీలకమని వారు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో గని సీనియర్ పర్సనల్ ఆఫీసర్ ఏ. రవళి, యూనియన్ల నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఆరోగ్యమే మహాభాగ్యం

**- యూత్ ఫర్ సొసైటీ ఫౌండర్ శ్రీనివాసరావు**

**- ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా అవగాహన**

**వేద న్యూస్, వరంగల్:**



ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఏవీవీ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్, యూత్ ఫర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూత్ ఫర్ సొసైటీ ఫౌండర్ కోడిమాల శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఆరోగ్యవంతమైన ప్రజలతోనే ఆరోగ్యవంతమైన సమాజం నిర్మాణం సాధ్యమని తెలిపారు. మంచి ఆహారం తీసుకోవడం, పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్య సూత్రాలను పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. జంక్ ఫుడ్కు దూరంగా ఉండి, శాకాహారాన్ని ప్రోత్సహించాలని సూచించారు. అలాగే ఫుడ్ సేఫ్టీ అధికారులు కల్తీ ఆహారంపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల యూత్ ఫర్ సొసైటీ సభ్యులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం

**- మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటీవ్స్ అండ**

**వేద న్యూస్, హనుమకొండ:**



ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్ స్వర్గీయ బి. రమేష్ కుటుంబానికి తెలంగాణ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటీవ్స్ యూనియన్ ఆధ్వర్యంలో రూ.75వేల బెనివలెంట్ ఫండ్ అందజేశారు. వరంగల్ బ్రాంచ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పాల్గొని కుటుంబానికి అండగా నిలిచారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ అధ్యక్షుడు వినయ్ కుమార్, కార్యదర్శి సుధీర్ కుమార్, జాయింట్ సెక్రటరీ మహేష్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు నరేష్, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్ పామ్ పంట పై రైతులకు అవగాహన



**వేద న్యూస్, పోతంగల్ :**

పోతంగల్ మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం ఆయిల్ ఫామ్ పంటల సాగు పై రైతులకు మండల వ్యవసాయ అధికారి నిశిత అవగాహన కల్పించారు. ఆయిల్ పామ్ పంటకు ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుందని, ఆయిల్ పామ్ పంట సాగు చేయడానికి ఆసక్తి గల రైతులు మండల వ్యవసాయ అధికారిని సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి వహీద్, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత



**వేద న్యూస్, రుద్రూర్ :**

రుద్రూర్ మండలంలోని అక్బర్ నగర్ గ్రామనికి చెందిన కల్దుర్కి పోశెట్టి ఇటీవల అకాలంగా మరణించడం జరిగింది. వారి కుటుంబ సభ్యుల ఆర్థిక పరిస్థితి బాగాలేదని స్థానిక బిజెపి నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న బాన్సువాడ నియోజకవర్గం బిజెపి నాయకులు ఎన్ఆర్ఐ కోనేరు శశాంక్ తన వంతు సహాయంగా వారి కుటుంబ సభ్యులకు 5,000 రూపాయలు ఆర్థిక సాయం అందించారు. వారి కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రుద్రూర్ మండల అధ్యక్షుడు ఆలపాటి హరికృష్ణ, ఉపాధ్యక్షులు కృష్ణంరాజు, ప్రధాన కార్యదర్శి ఏముల గజేందర్, మండల కోశాధికారి కటిక రామరాజు, బూత్ అధ్యక్షులు నాగారం చిన్న సాయిలు, పోతరాజు శ్రీనివాస్, సీనియర్ నాయకులు వరప్రసాద్, చుందూరి తేజ, హరీష్ పెద్ది, సందీప్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కోట మైసమ్మ ఆలయంలో టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్

**వేద న్యూస్, కారేపల్లి:**



సింగరేణి మండలం ఉసిరికాయలపల్లి గ్రామంలోని కోట మైసమ్మ ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న వైరాఇల్లందు నియోజకవర్గ స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ ఘనంగా కొనసాగుతోంది. గ్రామీణ క్రీడా వాతావరణాన్ని కళకళలాడిస్తున్న ఈ పోటీలు విజయవంతంగా మూడో రోజుకు చేరుకుని ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. ఈ టోర్నమెంట్ ప్రముఖులు పర్స పట్టాభి రామారావు ఆశీస్సులతో, డాక్టర్ బాలసాని వినయ్ గౌడ్ సౌజన్యంతో నిర్వహించబడుతోంది. ఆయన నిర్వహిస్తున్న శ్రీ గణేష్ అడ్వాన్స్ డెంటల్ కేర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఈ క్రీడా వేడుకలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా డాక్టర్ బాలసాని వినయ్ గౌడ్ మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంత యువతలో ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీయడానికి ఇలాంటి టోర్నమెంట్లు ఎంతో దోహదపడతాయని అన్నారు. గ్రామ స్థాయిలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడమే లక్ష్యంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్రీడల ద్వారా యువతలో సమయపాలన, జట్టు భావన, క్రమశిక్షణ, సమన్వయం వంటి ముఖ్యమైన లక్షణాలు పెంపొందుతాయని ఆయన పేర్కొన్నారు. యువత క్రీడలతో పాటు విద్య, సామాజిక బాధ్యతలపై కూడా దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లలిత కళామందిర్ ప్రొప్రైటర్ సుదర్శన్ గౌడ్, గ్రామ సర్పంచులు, ఉపసర్పంచులు, గ్రామ పెద్దలు, జట్టు సభ్యులు, క్రీడాకారులు మరియు క్రీడాభిమానులు భారీగా పాల్గొని పోటీలను ఉత్సాహంగా వీక్షించారు. మొత్తానికి, ఉసిరికాయలపల్లి కోట మైసమ్మ ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న ఈ టోర్నమెంట్ గ్రామీణ యువతకు కొత్త ఉత్సాహాన్ని నింపుతూ క్రీడా సంస్కృతిని మరింత బలపరుస్తోంది.

# రైస్ మిల్లుల్లో పునఃప్రారంభమైన ధాన్యం కొనుగోళ్లు



**వేద న్యూస్,నల్లగొండ ప్రతినిధి :**

మిర్యాలగూడ రైస్ మిల్లులో గత రాత్రి రైతులకు,మిల్లర్లకు మధ్య జరిగిన వాగ్వాదం నేపథ్యంలో నిలిచిపోయిన ధాన్యం కొనుగోళ్లు అధికారుల జోక్యంతో మళ్లీ మొదలయ్యాయి.స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్, డీఎస్పీ రాజశేఖర్ రాజ్ మిల్లర్లతో జరిపిన అత్యవసర చర్చలు సఫలమయ్యాయి.ధాన్యం కొనుగోళ్ల నిలిపివేతతో రైతులు ఆందోళన చెందుతున్న తరుణంలో జిల్లా యంత్రాంగం, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి వేగంగా స్పందించింది.జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్,శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, డీఎస్పీ రాజశేఖర్ రాజు సంయుక్తంగా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో అత్యవసర సమావేశం నిర్వహించారు.మిల్లుల వద్ద నిలిచిపోయిన ధాన్యం ట్రాక్టర్లను వెంటనే ఖాళీ చేయించి,కొనుగోళ్లు ప్రారంభించాలని అధికారుల బృందం మిల్లర్లను ఆదేశించింది.రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర అందేలా చూడాలని, ధరల విషయంలో రైతులకు నష్టం కలగకూడదని ఎమ్మెల్యే బి ఎల్ ఆర్ స్పష్టం చేశారు.అన్నదాతలతో మిల్లర్లు సత్ప్రవర్తనతో మెలగాలని, ఎలాంటి ఘర్షణలకు తావులేకుండా కొనుగోలు ప్రక్రియ సాఫీగా సాగాలని అధికారులు సూచించారు.అధికారుల ఆదేశాలకు మిల్లర్లు సానుకూలంగా స్పందించి,తక్షణమే కొనుగోళ్లు చేపడుతున్నట్లు ప్రకటించారు.దీంతో హైవేపై ధర్నా చేస్తున్న రైతులు తమ నిరసనను విరమించి మిల్లుల వద్దకు చేరుకున్నారు.వర్ష సూచన ఉన్న నేపథ్యంలో కొనుగోళ్లు వేగవంతం కావడంతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

# పేదల సొంతింటి కల సాకారం

**- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కొత్తూరులో ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభం**

**వేద న్యూస్, కొత్తూరు:**



ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేద ప్రజల సొంతింటి కల నెరవేరుతోందని షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. కొత్తూరు మున్సిపాలిటీలో నిర్మించిన ఏడు ఇందిరమ్మ ఇళ్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వంలో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదలకు గృహసౌకర్యం కల్పించడం జరుగుతోందని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు ప్రతి కుటుంబానికి సౌభాగ్యాన్ని తీసుకువస్తాయని పేర్కొన్నారు. కొత్త ఇళ్లను అందుకున్న లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బాలాజీ, చైర్పర్సన్ బాతుక లావణ్య, కాంగ్రెస్ నాయకులు, కౌన్సిలర్లు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# రెడీమిక్స్ వాహనం ఢీకొని విద్యుత్ స్తంభాలు ధ్వంసం

**- రూ.2 లక్షల ఆస్తి నష్టం: ఏఈ శ్రీశైలం**

**వేద న్యూస్, రేవల్లి:**



వనపర్తి జిల్లా రేవల్లి మండలం కొంకలపల్లి గ్రామంలో మంగళవారం జరిగిన ప్రమాదంలో రెడీమిక్స్ వాహనం ఢీకొని ఏడు విద్యుత్ స్తంభాలు ధ్వంసమయ్యాయి. నంద్యాల నుంచి శోధా కంపెనీకి వెళ్తున్న AP 39 UP 3884 నంబర్ గల వాహనం అదుపుతప్పి గ్రామంలోని రైతుల కోసం ఏర్పాటు చేసిన ఎల్టి లైన్ స్తంభాలను ఢీకొట్టింది. ఈ ఘటనలో మొత్తం 7 విద్యుత్ స్తంభాలు నేలమట్టమయ్యాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.2 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు విద్యుత్ శాఖ ఏఈ శ్రీశైలం తెలిపారు. డ్రైవర్ నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమని స్థానికులు ఆరోపించారు.

## నిరుపేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే మేఘారెడ్డి
- కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ



**వేద న్యూస్, వనపర్తి:**

నిరుపేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి తెలిపారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి సహాయనిధి, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా అర్హులైన లబ్ధిదారులకు నిరంతరం సహాయం అందిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల అభ్యున్నతికి పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నదన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ఒక్కో లబ్ధిదారునికి రూ.5 లక్షలు అందజేస్తూ సొంతింటి కలను నెరవేర్చుతున్నామని చెప్పారు. అలాగే అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డులు జారీ చేసి సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని 8 మండలాలు, రెండు మున్సిపాలిటీలకు చెందిన 178 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.1,00,116 విలువగల చెక్కులు అందజేశారు. లబ్ధిదారులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, మార్కెట్ యార్డ్ చైర్మన్, అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గొల్లపల్లి రిజర్వాయర్‌పై ఆందోళనలు

- హరీష్ రావు సభను విజయవంతం చేయాలి
- బీఆర్ఎస్ నేతల పిలుపు



**వేద న్యూస్, వనపర్తి:**

గొల్లపల్లి-చీర్కపల్లి రిజర్వాయర్ ప్రతిపాదనను విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ మాజీ మంత్రి హరీష్ రావు నిర్వహించనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని టీఆర్ఎస్ నాయకులు పిలుపునిచ్చారు. పెబ్బేర్ మండల సమావేశంలో జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్ మాట్లాడుతూ, రిజర్వాయర్ ప్రతిపాదన ప్రజల అవసరాల కంటే కమిషన్ల కోసమే తీసుకువచ్చారని ఆరోపించారు. రైతులకు నష్టం కలిగించే ఈ ప్రాజెక్టును ప్రభుత్వం పునరాలోచించాలని కోరారు. హరీష్ రావు పర్యటనతో అవినీతి వ్యవహారాలు వెలుగులోకి వస్తాయని, అందుకే తప్పుడు ప్రచారం జరుగుతోందని విమర్శించారు. రిజర్వాయర్ వల్ల పెద్ద ఎత్తున భూములు ముంపుకు గురయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. పెబ్బేర్ మండలం నుంచి భారీగా ప్రజలు సభకు తరలిరావాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రం సందర్శన

- యువత సాంకేతిక విద్యను సద్వినియోగం చేసుకోవాలి
- విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి



**వేద న్యూస్, మహబూబ్‌నగర్:**

మహబూబ్‌నగర్ నగరంలోని మెప్మా కార్యాలయంలో మహబూబ్‌నగర్ ఫస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ.. ఆధునిక కాలంలో కంప్యూటర్ పరిజ్ఞానం ప్రతి ఒక్కరికీ అత్యవసరమని తెలిపారు. యువత ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. భవిష్యత్తులో మెరుగైన ఉపాధి అవకాశాల కోసం సాంకేతిక విద్యపై దృష్టి పెట్టాలని, ఉచిత శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రోత్సహించారు. శిక్షణ విధానం, కోర్సులపై నిర్వాహకులను అడిగి తెలుసుకుని, విద్యార్థులకు నాణ్యమైన శిక్షణ అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, నాయకులు, శిక్షకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఐపీఎల్‌లో టాప్ వికెట్ టేకర్లు

**వేద న్యూస్ డెస్క్:**



ఇండియన్ ప్రీమియర్ లీగ్ చరిత్రలో అత్యధిక వికెట్లు సాధించిన బౌలర్ల జాబితా ఎప్పటికప్పుడు క్రికెట్ అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తూనే ఉంటుంది. ప్రతి సీజన్‌తో కొత్త రికార్డులు నమోదవుతుండగా, ఈ జాబితాలో అగ్రస్థానాల కోసం బౌలర్ల మధ్య గట్టి పోటీ కొనసాగుతోంది. ముఖ్యంగా ఈ జాబితాలో భారత బౌలర్ల ఆధిపత్యం స్పష్టంగా కనిపించడం విశేషంగా చెప్పుకోవాలి. ప్రస్తుతం ఈ జాబితాలో అగ్రస్థానంలో కొనసాగుతున్నది యుజ్వేంద్ర చహల్. రాజస్థాన్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ లెగ్ స్పిన్నర్ తన క్రమశిక్షణతో కూడిన బౌలింగ్, చురుకైన వ్యూహాలతో బ్యాటర్లను ఇబ్బంది పెడుతూ ఇప్పటివరకు 224 వికెట్లు సాధించి మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. మధ్య ఓవర్లలో వికెట్లు తీయడంలో చహల్‌కు ఉన్న నైపుణ్యం అతడిని ప్రత్యేకంగా నిలబెట్టింది. చహల్ తర్వాత రెండవ స్థానంలో భువనేశ్వర్ కుమార్ కొనసాగుతున్నాడు. స్వింగ్ బౌలింగ్‌లో తనదైన ముద్ర వేసుకున్న భువనేశ్వర్, ముఖ్యంగా పవర్‌ప్లేలో బ్యాటర్లను కట్టడి చేయడంలో ప్రసిద్ధి పొందాడు. సన్‌రైజర్స్ జట్టుకు కీలక బౌలర్‌గా నిలిచిన అతడు 200కు పైగా వికెట్లు సాధించి తన స్థిరత్వాన్ని మరోసారి నిరూపించాడు. మూడవ స్థానంలో వెస్టిండీస్‌కు చెందిన సునీల్ నరైన్ ఉన్నాడు. కోల్‌కతా జట్టుకు కీలక బౌలర్‌గా నిలిచిన నరైన్ తన మిస్టరీ స్పిన్‌తో అనేకమంది బ్యాటర్లను మోసం చేశాడు. అవసరమైనప్పుడు బ్యాటింగ్‌లో కూడా జట్టుకు తోడ్పడుతూ ఆల్‌రౌండర్‌గా తన విలువను పెంచుకున్నాడు. నాల్గవ స్థానంలో పీయూష్ చావ్లా కొనసాగుతున్నాడు. పలు ఫ్రాంచైజీలకు ఆడిన అనుభవంతో ఐపీఎల్‌లో తనదైన ముద్ర వేసుకున్న ఈ లెగ్ స్పిన్నర్ కీలక సందర్భాల్లో వికెట్లు తీయడంలో ప్రసిద్ధి పొందాడు. అనుభవం, వైవిధ్యం కలిసిన బౌలింగ్‌తో జట్లకు విజయాల్లో భాగస్వామ్యమయ్యాడు. ఐదవ స్థానంలో రవిచంద్రన్ అశ్విన్ మరియు జస్ప్రీత్ బుమ్రా నిలిచారు. అశ్విన్ తన తెలివైన ఆఫ్ స్పిన్, వ్యూహాత్మక బౌలింగ్‌తో బ్యాటర్లను ఇబ్బంది పెడుతుంటే, బుమ్రా తన యార్కర్లు, డెత్ ఓవర్లలో కట్టుదిట్టమైన బౌలింగ్‌తో మ్యాచ్ ఫలితాలను మార్చగల సామర్థ్యం కలిగిన బౌలర్‌గా గుర్తింపు పొందాడు. ఈ టాప్ 5 జాబితాలో నలుగురు భారత బౌలర్లు ఉండటం భారత క్రికెట్ బలం ఎంత ఉన్నదో స్పష్టంగా తెలియజేస్తోంది. ఐపీఎల్ వేదికగా తమ ప్రతిభను నిరూపించుకున్న ఈ ఆటగాళ్లు అంతర్జాతీయ స్థాయిలో కూడా కీలక పాత్ర పోషిస్తున్నారు. రాబోయే సీజన్లలో ఈ జాబితాలో మార్పులు చోటుచేసుకునే అవకాశమున్నప్పటికీ, ఈ బౌలర్లు మరిన్ని రికార్డులు సృష్టించే దిశగా ముందుకు సాగుతారని క్రీడా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## మద్యం మత్తులో డ్రైవింగ్ ఆరోపణలు



**వేద న్యూస్ డెస్క్:**

ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ డేవిడ్ వార్నర్ మద్యం మత్తులో వాహనం నడిపిన ఆరోపణలతో పోలీసుల అదుపులోకి వెళ్లిన ఘటన క్రీడా వర్గాల్లో సంచలనం సృష్టిస్తోంది. పాకిస్థాన్ సూపర్ లీగ్‌లో పాల్గొనేందుకు సిద్ధమవుతున్న సమయంలో ఈ పరిణామం చోటుచేసుకోవడం మరింత చర్చనీయాంశంగా మారింది. వ్యక్తిగత పనుల నిమిత్తం స్వదేశానికి వచ్చిన వార్నర్, సిడ్నీలోని మరౌబ్రా ప్రాంతంలో ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన తనిఖీల సమయంలో అనుమానాస్పదంగా ప్రవర్తించినట్లు సమాచారం. పోలీసులు నిర్వహిస్తున్న తనిఖీలను గమనించిన అతడు తన కారును కొంత దూరంలో ఆపినట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని గమనించిన పోలీసులు అతడి వద్దకు వెళ్లి మద్యం పరీక్ష నిర్వహించగా, శ్వాస పరీక్షలో మద్యం సేవించినట్టు నిర్ధారణ అయినట్లు తెలుస్తోంది. దీంతో వెంటనే వార్నర్‌ను అదుపులోకి తీసుకుని తదుపరి చర్యల కోసం కేసు నమోదు చేసినట్లు సమాచారం. అనంతరం అతడిని కోర్టులో హాజరుపరచనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనతో పాకిస్థాన్ సూపర్ లీగ్‌లో అతని పాల్గొనడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే జట్టుకు కీలక ఆటగాడిగా భావిస్తున్న వార్నర్ గైర్హాజరు అయితే జట్టుపై ప్రభావం పడే అవకాశం ఉందని క్రీడా విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ సంఘటన క్రీడాకారుల బాధ్యత, ప్రజల ముందు వారి ప్రవర్తనపై మరోసారి చర్చకు దారితీసింది.

## స్టార్క్ గాయంతో ఢిల్లీకి దెబ్బ

**వేద న్యూస్ డెస్క్:**



ఐపీఎల్ సీజన్‌లో ఢిల్లీ జట్టుకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. జట్టు ప్రధాన వేగబౌలర్ మిచెల్ స్టార్క్ గాయంతో బాధపడుతూ తదుపరి మ్యాచ్‌లకు దూరమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. భుజం మరియు మోచేయి నొప్పులతో ఇబ్బంది పడుతున్న ఆయన కనీసం మూడు మ్యాచ్‌లకు అందుబాటులో ఉండకపోవచ్చని సమాచారం. ఈ సీజన్ ప్రారంభంలో రెండు మ్యాచ్‌లలో విజయం సాధించిన ఢిల్లీ జట్టుకు ఇప్పుడు ఈ పరిణామం ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా బౌలింగ్ విభాగంలో స్టార్క్ కీలక పాత్ర పోషిస్తున్న నేపథ్యంలో అతడి గైర్హాజరు జట్టు ప్రదర్శనపై ప్రభావం చూపే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం స్టార్క్ ఆరోగ్య పరిస్థితిని వైద్య బృందం సమీక్షిస్తోంది. అతడి పునరాగమనం ఆస్ట్రేలియా క్రికెట్ బోర్డు అనుమతిపై ఆధారపడి ఉండనుంది. ఒకవేళ అనుమతి లభిస్తే ఈ నెల ఇరవై ఒకటో తేదీన సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగే మ్యాచ్ నాటికి తిరిగి జట్టుతో చేరే అవకాశాలు ఉన్నాయని క్రీడా వర్గాలు భావిస్తున్నాయి. అప్పటివరకు జట్టు యాజమాన్యం ప్రత్యామ్నాయ బౌలర్లను సిద్ధం చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. స్టార్క్ వంటి అనుభవజ్ఞుడైన బౌలర్ లేకపోవడం ఢిల్లీ జట్టుకు పెద్ద లోటుగా మారనుంది. కీలక మ్యాచ్‌ల సమయంలో అతని అనుభవం, వేగం జట్టుకు ఎంతో ఉపయోగపడుతుండటంతో, అభిమానుల్లో కూడా ఆందోళన వ్యక్తమవుతోంది. మ్యాచ్‌లలో జట్టు ప్రదర్శన ఎలా ఉంటుందన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

## ఉప్పల్ స్టేడియంలో డిజిటల్ టికెటింగ్ అమలు

**వేద న్యూస్ డెస్క్:**



ఐపీఎల్ మ్యాచ్‌ల నేపథ్యంలో ఉప్పల్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో కీలక మార్పులు చేపడుతున్నారు. ప్రేక్షకులకు సులభమైన ప్రవేశం కల్పించడమే లక్ష్యంగా డిజిటల్ టికెటింగ్ విధానాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయాలని పోలీసులు నిర్ణయించారు. ఏప్రిల్ పదమూడు నుంచి జరిగే మ్యాచ్‌లకు ఈ కొత్త విధానం అమల్లోకి రానుంది. ఇటీవలి మ్యాచ్ సందర్భంగా టికెట్ల విషయంలో అభిమానులు ఎదుర్కొన్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నారు. స్టేడియం గేట్ల వద్ద భారీ రద్దీ, తోపులాటలు, టికెట్ ధృవీకరణలో ఆలస్యాలు వంటి సమస్యలు తలెత్తడంతో ప్రేక్షకులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ఈ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ప్రవేశపెడుతున్న డిజిటల్ టికెటింగ్ విధానం ద్వారా ప్రేక్షకులు తమ మొబైల్ ఫోన్లలోని టికెట్‌ను నేరుగా స్కాన్ చేయించుకుని స్టేడియంలోకి వేగంగా ప్రవేశించవచ్చు. దీనివల్ల గేట్ల వద్ద రద్దీ తగ్గడంతో పాటు సమయం కూడా ఆదా అవుతుంది. ముఖ్యంగా నకిలీ టికెట్ల సమస్యను పూర్తిగా అరికట్టడంలో ఈ విధానం కీలక పాత్ర పోషిస్తుందని అధికారులు భావిస్తున్నారు. ప్రతి టికెట్‌కు ప్రత్యేక గుర్తింపు ఉండటంతో అక్రమంగా టికెట్ల విక్రయాన్ని కూడా నియంత్రించవచ్చని తెలిపారు. ఇక భద్రతా పరంగా కూడా కఠిన చర్యలు చేపడుతున్నారు. స్టేడియం పరిసర ప్రాంతాల్లో అదనపు పోలీసు బలగాలను మోహరించడంతో పాటు ప్రతి ప్రవేశ ద్వారం వద్ద కట్టుదిట్టమైన తనిఖీలు నిర్వహించనున్నారు. ప్రేక్షకుల భద్రతకు ఎలాంటి భంగం కలగకుండా పలు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అలాగే పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ విషయంలో కూడా ప్రత్యేక ప్రణాళికలు అమలు చేయనున్నారు. ప్రేక్షకులు మ్యాచ్‌ను ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆస్వాదించేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. కొత్త విధానం వల్ల ప్రవేశం వేగవంతం కావడంతో పాటు మొత్తం నిర్వహణ మరింత సులభతరం అవుతుందని పేర్కొన్నారు. ఐపీఎల్ మ్యాచ్‌లకు భారీగా అభిమానులు హాజరయ్యే నేపథ్యంలో ఈ మార్పులు కీలకంగా మారనున్నాయి.

## తమీమ్ ఇక్బాల్‌కు బీసీబీ బాధ్యతలు



**వేద న్యూస్ డెస్క్:**

బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు అధ్యక్షుడిగా మాజీ క్రికెటర్ తమీమ్ ఇక్బాల్ నియామకం క్రీడా వర్గాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది. అవినీతి ఆరోపణలతో వివాదాల్లో నిలిచిన బోర్డుకు మార్పులు తీసుకురావాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. గత బోర్డును రద్దు చేసిన అనంతరం కొత్త అధ్యక్షుడిగా తమీమ్‌ను నియమించడం ద్వారా వ్యవస్థలో పారదర్శకత తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇటీవల జరిగిన ఎన్నికల్లో అవకతవకల ఆరోపణలు రావడంతో, విషయాన్ని పరిశీలించిన కమిటీ తమీమ్ పేరును సూచించగా ప్రభుత్వం ఆమోదం తెలిపింది. మాజీ ఓపెనర్‌గా జాతీయ జట్టుకు సేవలందించిన తమీమ్, ప్రస్తుతం ముప్పై ఏడు సంవత్సరాల వయసులోనే ఈ పదవిని చేపట్టడం విశేషంగా నిలిచింది. దీంతో బోర్డు చరిత్రలో అత్యంత పిన్నవయస్కుడైన అధ్యక్షుడిగా రికార్డు సృష్టించాడు. పదకొండు మంది సభ్యులతో కూడిన తాత్కాలిక కమిటీతో కలిసి క్రికెట్ అభివృద్ధి దిశగా చర్యలు తీసుకోనున్నాడు. జట్టు నిర్వహణ, దేశీయ క్రికెట్ వ్యవస్థలో సంస్కరణలు, యువ ఆటగాళ్లకు అవకాశాలు కల్పించడం వంటి అంశాలపై దృష్టి సారించనున్నట్లు సమాచారం.

# ఆరు ప్రేమలు విఫలం.. సింగిల్‌గా ఉండాలన్న శ్రుతి నిర్ణయం

వేద న్యూస్ డెస్క్:



సినీ రంగంలో ప్రేమలు, పెళ్లిళ్లు ఎప్పుడూ హాట్ టాపిక్‌గానే ఉంటాయి. ఈ క్రమంలో ప్రముఖ నటి శ్రుతి హాసన్ చేసిన తాజా వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. తన వ్యక్తిగత జీవితంపై ఇంత ఓపెన్‌గా మాట్లాడటం అరుదే కావడంతో అభిమానులు కూడా ఆసక్తిగా చర్చించుకుంటున్నారు. తాజా ఇంటర్వ్యూలో శ్రుతి హాసన్ తన ప్రేమ జీవితం గురించి సంచలన విషయాలు వెల్లడించింది. ఇప్పటివరకు తాను ఆరు సార్లు ప్రేమలో పడ్డానని, కానీ ఆ సంబంధాలన్నీ చివరికి విఫలమయ్యాయని తెలిపింది. ప్రతి సంబంధం ముగిసినప్పుడు తాను భావోద్వేగంగా దెబ్బతిన్నానని, ఆ అనుభవాలు తనపై గాఢమైన ముద్ర వేసాయని చెప్పింది. ప్రేమలో పడటం తప్పు కాదని, కానీ సరైన వ్యక్తి దొరకకపోతే అది బాధగా మారుతుందని ఆమె అభిప్రాయపడింది. ఈ అనుభవాల తర్వాత ప్రస్తుతం తన జీవితంలో ప్రశాంతత, స్వీయ గౌరవం ముఖ్యమని భావిస్తున్నానని శ్రుతి స్పష్టం చేసింది. అందుకే ఇకపై కొంతకాలం ప్రేమ, పెళ్లి వంటి విషయాలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నానని వెల్లడించింది. సింగిల్‌గా ఉండటం కూడా ఒక మంచి ఎంపికేనని, అది తనకు ప్రస్తుతం ఆనందాన్ని ఇస్తోందని పేర్కొంది. ప్రఖ్యాత నటుడు కమల్ హాసన్ కుమార్తెగా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన శ్రుతి హాసన్, మొదట్లో తండ్రి పేరు వల్ల వచ్చిన గుర్తింపును తన ప్రతిభతో నిలబెట్టుకుంది. హీరోయిన్‌గా పలు భాషల్లో నటిస్తూ, గాయని గానూ మంచి పేరు సంపాదించింది. టాలీవుడ్, బాలీవుడ్, కొలీవుడ్ ఇలా అన్ని ఇండస్ట్రీల్లో తనకంటూ ప్రత్యేక స్థానం ఏర్పరుచుకుంది. ఇక వ్యక్తిగత జీవిత విషయానికి వస్తే, గతంలో డూడుల్ ఆర్టిస్ట్ శాంతను హజారికాతో శ్రుతి రిలేషన్‌లో ఉన్న సంగతి తెలిసిందే. వీరిద్దరూ కలిసి ఉన్న ఫోటోలు కూడా సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. అయితే కొంతకాలం తర్వాత ఆ సంబంధం ముగియడంతో శ్రుతి మళ్లీ ఒంటరిగా మారింది. ప్రస్తుతం శ్రుతి తన పూర్తి దృష్టిని కెరీర్‌పైనే పెట్టింది. పాన్ ఇండియా స్థాయిలో సినిమాలు చేస్తూ బిజీగా గడుపుతోంది. కొత్త ప్రాజెక్టులతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. వ్యక్తిగత జీవితంలో ఎదురైన అనుభవాలను పక్కన పెట్టి, ప్రొఫెషనల్‌గా మరింత ఎదగాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు కనిపిస్తోంది. మొత్తానికి, ప్రేమలో వరుస నిరాశలు ఎదురైన తర్వాత కూడా ధైర్యంగా ముందుకు సాగుతూ, తన నిర్ణయాలను స్పష్టంగా వెల్లడించిన శ్రుతి హాసన్ వ్యాఖ్యలు ప్రస్తుతం అభిమానుల్లోనే కాదు, సినీ వర్గాల్లో కూడా చర్చనీయాంశంగా మారాయి.

# జుట్టు పెంపుపై సందీప్ కిషన్ సలహాలు వైరల్

వేద న్యూస్ డెస్క్:



టాలీవుడ్ యంగ్ హీరో సందీప్ కిషన్ సోషల్ మీడియాలో అభిమానులతో ఎప్పుడూ చురుకుగా ఉంటూ, వారి ప్రశ్నలకు సమాధానాలు ఇస్తూ ఉంటాడు. తాజాగా ఓ అభిమాని జుట్టు పొడవుగా పెంచుకోవడానికి చిట్కాలు చెప్పాలని కోరగా, ఆయన ఇచ్చిన సలహాలు ఇప్పుడు వైరల్‌గా మారాయి. జుట్టు ఆరోగ్యం కోసం కేవలం బయట నుంచి సంరక్షణ సరిపోదని, లోపలి ఆరోగ్యం కూడా ఎంతో ముఖ్యమని సందీప్ పేర్కొన్నారు. తేలికగా జీర్ణమయ్యే శుభ్రమైన ఆహారం తీసుకోవాలని, చక్కెర మరియు నూనెలో వేయించిన పదార్థాలను తగ్గించాలని సూచించారు. ప్రతిరోజూ కొద్దిగా పెరుగు తీసుకోవడం, ఉదయం పరగడుపున వ్యాయామాలు చేయడం, సూపర్ సీడ్ మిశ్రమాలు తీసుకోవడం వల్ల జుట్టు బలంగా పెరుగుతుందని చెప్పారు. ఇంట్లోనే కొబ్బరి నూనెతో పాటు ఉల్లిపాయ, కరివేపాకు, రోజ్‌మేరీ వంటి పదార్థాలతో తయారుచేసిన నూనెను ఉపయోగించడం మంచిదని తెలిపారు. తలస్నానానికి వాడే నీరు పరిశుభ్రంగా ఉండాలని, దుమ్ము మరియు కాలుష్యాల నుంచి జుట్టును రక్షించుకోవాలని సూచించారు. అంతేకాకుండా, జుట్టును ప్రేమగా చూసుకోవడం అత్యంత ముఖ్యమని పేర్కొన్న ఆయన, ఆరు నెలలకోసారి నిపుణులైన వైద్యులను సంప్రదించి సలహాలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం ఆయన ఇచ్చిన ఈ చిట్కాలు సోషల్ మీడియాలో విస్తృతంగా చర్చకు దారితీశాయి.

# 'పెద్ది' రిలీజ్‌పై సందిగ్ధం




వేద న్యూస్ డెస్క్:

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా తెరకెక్కుతున్న పాన్ ఇండియా చిత్రం పెద్ది విడుదల తేదీపై మరోసారి అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మొదట ఈ సినిమాను ఏప్రిల్ 30న విడుదల చేస్తామని ప్రకటించినప్పటికీ, తాజా పరిస్థితులు చూస్తే ఆ తేదీకి రావడం కష్టమనే సంకేతాలు కనిపిస్తున్నాయి. ఇటీవల జరిగిన ఒక కార్యక్రమంలో నిర్మాత ఎస్‌కేఎన్ చేసిన వ్యాఖ్యలు సినిమాపై చర్చకు దారితీశాయి. సినిమా వాయిదా పడే అవకాశాలపై ఆయన చేసిన వ్యాఖ్యలతో అభిమానులు ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన వివరణ ఇచ్చినా, ఈ అంశం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. మరోవైపు రామ్ చరణ్ స్వయంగా సినిమా ఆలస్యం కాదని చెప్పడంతో అభిమానులు కొంత ఊరట పొందారు. అయితే తాజా సమాచారం ప్రకారం, ఈ సినిమా జూన్ నెలకు వాయిదా పడే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. జూన్ 4 లేదా జూన్ 24 తేదీల్లో విడుదల చేయాలని చిత్ర యూనిట్ పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. త్వరలో అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో షూటింగ్ వేగంగా కొనసాగుతోంది. కీలక సన్నివేశాల్లో రామ్ చరణ్ పాల్గొంటూ బిజీగా ఉన్నారు. ఈ చిత్రంలో ఆయన సరసన జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తోంది. అలాగే శివరాజ్‌కుమార్, జగపతి బాబు, దివ్యేందు శర్మ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రానికి సంగీతాన్ని ఆస్కార్ అవార్డు గ్రహీత ఏ.ఆర్. రెహ్మాన్ అందిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన పాటలు మంచి స్పందన అందుకున్నాయి. భారీ నిర్మాణ విలువలతో తెరకెక్కుతున్న ఈ సినిమాపై అభిమానుల్లో అంచనాలు రోజురోజుకీ పెరుగుతున్నాయి. రిలీజ్ డేట్‌పై స్పష్టత వచ్చిన వెంటనే ప్రమోషన్ కార్యక్రమాలను మరింత వేగంగా నిర్వహించేందుకు యూనిట్ సిద్ధమవుతోంది. మొత్తానికి, 'పెద్ది' ఏప్రిల్‌లో కాకుండా జూన్‌లో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశమే ఎక్కువగా కనిపిస్తోంది.

# నెలసరి అడ్డంకి కాదు.. మహిళలకు శ్రీలీల ప్రేరణాత్మక సందేశం

వేద న్యూస్ డెస్క్:



టాలీవుడ్‌లో వేగంగా ఎదుగుతున్న యంగ్ హీరోయిన్ శ్రీలీల తాజాగా మహిళల ఆరోగ్యం, ముఖ్యంగా నెలసరి (పీరియడ్స్) అంశంపై చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో విస్తృత చర్చకు దారితీశాయి. ఒక కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆమెకు షూటింగ్ సమయంలో నెలసరి ఇబ్బందులు కలిగిస్తాయా అనే ప్రశ్న ఎదురవగా, ఆమె ఇచ్చిన సమాధానం అనేకమందికి ప్రేరణగా మారింది. శ్రీలీల మాట్లాడుతూ, తాను నటించిన అనేక హిట్ పాటలు, ముఖ్యమైన సన్నివేశాలు కూడా నెలసరి సమయంలోనే షూట్ చేసిన సందర్భాలు ఉన్నాయని వెల్లడించింది. ఆ సమయంలో శారీరకంగా కొంత అసౌకర్యం ఉన్నప్పటికీ, దాన్ని అడ్డంకిగా భావించకుండా తన పని మీద దృష్టి పెట్టడం వల్లే విజయాలు సాధించగలిగానని తెలిపింది. పనిపట్ల నిబద్ధత, క్రమశిక్షణ ఉంటే ఏ పరిస్థితినైనా అధిగమించవచ్చని ఆమె స్పష్టం చేసింది. నెలసరి అనేది ప్రతి మహిళకు సహజ ప్రక్రియ అని, దాన్ని బలహీనతగా లేదా అడ్డంకిగా చూడకూడదని శ్రీలీల పేర్కొంది. సమాజంలో ఇప్పటికీ నెలసరి విషయంలో ఉన్న అపోహలు, సంకోచాలను తొలగించాల్సిన అవసరం ఉందని ఆమె అభిప్రాయపడింది. మహిళలు తమ ఆరోగ్యాన్ని కాపాడుకుంటూనే, తమ లక్ష్యాల దిశగా ధైర్యంగా ముందుకు సాగాలని ఆమె సూచించింది. పురుషులతో సమాన హక్కులు, అవకాశాలు కోరుకునే ఈ కాలంలో, ఇలాంటి సహజ పరిస్థితులను సాకుగా చూపకుండా తమ సామర్థ్యాన్ని నిరూపించుకోవాలని ఆమె చెప్పింది. శారీరక, మానసిక సవాళ్లు వచ్చినా వాటిని ధైర్యంగా ఎదుర్కొని విజయాన్ని సాధించడం మహిళల బలాన్ని తెలియజేస్తుందని పేర్కొంది. వైద్యురాలిగా కూడా చదువు పూర్తి చేసిన శ్రీలీలకు ఈ విషయంపై ఉన్న అవగాహన ఆమె మాటలకు మరింత విశ్వసనీయతను తీసుకువచ్చింది. ఆరోగ్య పరంగా జాగ్రత్తలు తీసుకుంటూనే, కెరీర్‌లోనూ ముందుకు సాగడం ఎలా సాధ్యమో తన అనుభవాల ద్వారా చెప్పగలిగింది. ప్రస్తుతం ఆమె చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతూ, ముఖ్యంగా యువతిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతున్నాయి. అనేక మంది మహిళలు శ్రీలీల మాటలను ప్రేరణగా తీసుకుని, తమ లక్ష్యాల సాధనలో మరింత ధైర్యంగా ముందుకు సాగాలని నిర్ణయించుకుంటున్నారని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు.

# బాక్సాఫీస్‌లో 'బైకర్' జోరు




వేద న్యూస్ డెస్క్:

టాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద ఈ వారం ఆసక్తికర పోటీ కొనసాగుతోంది. 'బైకర్', 'రాకాస' చిత్రాలు వేర్వేరు కథాంశాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చినప్పటికీ, వసూళ్లు మరియు టికెట్ బుకింగ్స్‌లో గట్టి పోటీని ప్రదర్శిస్తున్నాయి. రెండు సినిమాలు భిన్నమైన జానర్లకు చెందినవైనా, ప్రేక్షకుల ఆదరణలో సమాన స్థాయిలో నిలుస్తుండటం విశేషంగా మారింది. స్పోర్ట్స్ నేపథ్యంలో రూపొందిన 'బైకర్'లో శర్వానంద్ నటనకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. భావోద్వేగాలు, క్రీడా అంశాలు సమతుల్యంగా మేళవించిన ఈ చిత్రం కుటుంబ ప్రేక్షకులను కూడా ఆకట్టుకుంటోంది. కథలోని ఎమోషనల్ కంటెంట్, ప్రేరణాత్మక సన్నివేశాలు ప్రేక్షకులను థియేటర్లకు రప్పిస్తున్నాయి. ముఖ్యంగా యువతతో పాటు ఫ్యామిలీ ఆడియన్స్ కూడా ఈ సినిమాపై ఆసక్తి చూపుతున్నారు. కథనంలో ఉన్న సహజత్వం, పాత్రల మధ్య అనుబంధం ఈ చిత్రాన్ని మరింత బలపరుస్తున్నాయి. మరోవైపు వినోదభరిత కథతో వచ్చిన 'రాకాస'లో సంగీత్ శోభన్ తన హాస్యంతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాడు. లైట్ ఎంటర్‌టైన్‌మెంట్, సరదా సంభాషణలు, కామెడీ టైమింగ్ ఈ చిత్రానికి ప్రధాన బలం. ముఖ్యంగా యువ ప్రేక్షకుల్లో ఈ సినిమాకు మంచి ఆదరణ కనిపిస్తోంది. స్ట్రెస్ ఫ్రీ ఎంటర్‌టైన్‌మెంట్ కోరుకునే వారికి ఈ చిత్రం మంచి ఎంపికగా నిలుస్తోంది. వీకెండ్‌లో ఈ రెండు చిత్రాలు సమానంగా పోటీ పడినప్పటికీ, తాజా పరిస్థితుల్లో 'బైకర్' మళ్లీ ఆధిక్యంలోకి వచ్చింది. గత 24 గంటల్లో ఈ సినిమాకు ఎక్కువ టికెట్లు బుక్ కావడం గమనార్హం. 'రాకాస' కూడా మంచి స్థాయిలో వసూళ్లు రాబడుతున్నప్పటికీ, స్వల్పంగా వెనుకబడింది. అయినప్పటికీ రెండు సినిమాల మధ్య పోటీ మాత్రం ఇంకా హాట్‌గా కొనసాగుతోంది. సోమవారం కావడంతో సహజంగానే వసూళ్లలో కొంత తగ్గుదల కనిపించినా, ఈ రెండు చిత్రాల క్రేజ్ మాత్రం తగ్గలేదు. పెద్ద సినిమాలు విడుదలయ్యే వరకు ఈ రెండు చిత్రాలే థియేటర్లలో ప్రధాన ఆకర్షణగా నిలిచే అవకాశముంది. ముఖ్యంగా నగరాలతో పాటు చిన్న పట్టణాల్లో కూడా ఈ సినిమాలకు స్థిరమైన స్పందన లభిస్తోంది. వాణిజ్య వర్గాల అంచనా ప్రకారం, 'బైకర్'లోని భావోద్వేగ కథాంశం కారణంగా దీర్ఘకాలంలో మంచి వసూళ్లు సాధించే అవకాశం ఉంది. నెమ్మదిగా కానీ స్థిరంగా కలెక్షన్లు పెంచుకునే అవకాశం ఉందని ట్రేడ్ విశ్లేషకులు చెబుతున్నారు. మరోవైపు 'రాకాస' మాత్రం తన వినోదంతో తక్కువ సమయంలోనే మంచి ఆదాయం రాబట్టే అవకాశముందని భావిస్తున్నారు. మొత్తానికి, 'బైకర్' మరియు 'రాకాస' చిత్రాల మధ్య పోటీ ఉత్కంఠభరితంగా కొనసాగుతోంది. ప్రేక్షకుల అభిరుచికి అనుగుణంగా రెండు సినిమాలు తమదైన శైలిలో ఆకట్టుకుంటుండగా, రాబోయే రోజుల్లో ఏ చిత్రం పైచేయి సాధిస్తుందో చూడాలి.

# అల్లు అర్జున్ బర్త్‌డేకు టైటిల్ సర్ప్రైజ్




వేద న్యూస్ డెస్క్:

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ పుట్టినరోజు సందర్భంగా అభిమానులకు ప్రత్యేక కానుక సిద్ధమవుతోంది. ప్రముఖ దర్శకుడు అట్లీ దర్శకత్వంలో రూపొందుతున్న భారీ పాన్ వరల్డ్ ప్రాజెక్ట్‌కు సంబంధించిన టైటిల్‌ను ఏప్రిల్ 8 ఉదయం 11 గంటలకు అధికారికంగా ప్రకటించనున్నట్లు చిత్ర బృందం వెల్లడించింది. ఇప్పటివరకు AA22xA6 అనే వర్కింగ్ టైటిల్‌తో కొనసాగుతున్న ఈ చిత్రం, రేపటి నుంచి అసలు పేరుతో ప్రేక్షకుల ముందుకు రానుంది. పుష్ప 2: ది రూల్ విజయంతో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన అల్లు అర్జున్, 'జవాన్'తో భారీ విజయం సాధించిన అట్లీ కలయికలో వస్తున్న ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిని దాటి అంతర్జాతీయ స్థాయిలో రూపొందుతోంది. సినిమా ప్రారంభానికి ముందే అమెరికాలోని లాస్ ఏంజిల్స్‌లో హాలీవుడ్ విజువల్ ఎఫెక్ట్స్ సంస్థలతో చర్చలు జరపడం ఈ ప్రాజెక్ట్‌పై ఆసక్తిని మరింత పెంచింది. దీంతో ఈ చిత్రం అత్యాధునిక సాంకేతికతతో రూపొందే విజ్ఞాన శాస్త్ర నేపథ్య థ్రిల్లర్‌గా ఉండబోతుందనే ప్రచారం సాగుతోంది. ఈ చిత్రంలో కథానాయికగా దీపికా పదుకొణే నటిస్తుండగా, మృణాల్ ఠాకూర్, జాన్వీ కపూర్ కీలక పాత్రల్లో కనిపించనున్నట్లు సమాచారం. మరోవైపు రష్మిక మందన్న ప్రతినాయక పాత్రలో కనిపించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఈ విషయాలపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. సన్ పిక్చర్స్ బ్యానర్‌పై కళానిధి మారన్ నిర్మిస్తున్న ఈ చిత్రం భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతోంది. అంతర్జాతీయ ప్రమాణాలతో రూపొందుతున్న ఈ సినిమా వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు రానుంది. మొత్తానికి, అల్లు అర్జున్ పుట్టినరోజు సందర్భంగా టైటిల్ రివీల్‌తో ఈ ప్రాజెక్ట్‌పై ఉన్న అంచనాలు మరింత పెరగనున్నాయి. అభిమానులు ఈ ప్రకటన కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073